


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 16-07-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 267 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుకు కమిటీ

## సీఎస్ నేతృత్వంలో ఏర్పాటుకు కేబినెట్ భేటీలో నిర్ణయం



అమరావతి: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు సాయమందించేందుకు ఉద్దేశించిన వైఎస్సార్ చేయూత పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాలుగేళ్లలో రూ.65వేలు ఇచ్చే ఈ పథకానికి సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోదం తెలిపినట్లు మంత్రి పేర్ని నాని తెలిపారు. ఈ పథకం కింద మొత్తం 25 లక్షల మంది మహిళలకు పథకం వర్తిస్తుందని చెప్పారు. కేబినెట్ సమావేశంలో అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

44,500 పాఠశాలల్లో నాడు- నేడు పథకాన్ని 3 దశల్లో అమలుకు నిర్ణయించినట్లు పేర్ని నాని వెల్లడించారు. తొలి దశలో కేటాయించిన రూ.920 కోట్లకు అదనంగా మరో రూ.200 కోట్లు విడుదల చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రంలో 25 లేదా 26 జిల్లాలు ఏర్పాటు చేసేందుకు అధ్యయన కమిటీ ఏర్పాటుకు కేబినెట్ తీర్మానించింది. ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పాటు కానుంది. రాయలసీమ కరవు నివారణకు రూ.40వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు. సీపీఎస్ రద్దు కోసం టీచర్లు చేసిన ఆందోళనపై పెట్టిన కేసులు రద్దు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

గుంటూరులో పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారన్న కారణంతో ముస్లింలపై పెట్టిన కేసుల ఉపసంహరణకు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

ఇసుక అంశంపై ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీఎండీసీకి పనిభారం తగ్గించే దిశగా ఇసుక కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇసుక మినహా మిగతా ఖనిజాల వ్యవహారాలన్నీ ఏపీఎండీసికి బదిలీ చేయనున్నారు. ఇసుక కార్పొరేషన్‌పై ముగ్గురు మంత్రుల కమిటీ పర్యవేక్షణ ఉంటుంది. ఇసుక వ్యవహారాలను ఎప్పటికప్పుడు కొడాలి నాని, పేర్ని నాని, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డితో కూడిన కమిటీ పర్యవేక్షిస్తుంది.

రాష్ట్రంలో 9,712 వైద్యుల పోస్టుల భర్తీకి కేబినెట్ పచ్చజెండా ఊపింది. 5701 కొత్త పోస్టులు, 4011 పాత పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది.

### ఏపీ కేబినెట్ నిర్ణయాలు

పాఠశాలల్లో నాడు -నేడు కార్యక్రమానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలు, కాలేజీలు, హాస్టళ్లను నాడు -నేడు కింద అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. అదేవిధంగా స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్‌లో 28 పోస్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

పాలనా సౌలభ్యంతో పాటు ప్రజలకు చేరువగా ఉండేలా కొత్త జిల్లాల ఏర్పాటుకై అధ్యయన కమిటీని ఏర్పాటు చేసేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు కానున్న

తరువాయి 2లో..

# స్నేహంతోనే శాంతి వర్ధిల్లుతుంది

## నైపుణ్యాలే కీలకమన్న ప్రధాని మోదీ

### 'వరల్డ్ యూత్ స్కిల్స్ డే' సందర్భంగా వీడియో ప్రసంగంలో మోదీ



దిల్లీ: 'ప్రపంచమంతా ఆర్థిక రంగంలో సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలోనే కరోనా రూపంలో మహమ్మారి వచ్చిపడింది. గడిచిన కొద్ది నెలలుగా భారత్ స్వయంగా కరోనాతో పోరాడుతూ, ప్రపంచ దేశాలకు కూడా సహాయ కారికగా నిలబడిందని చెప్పడానికి గర్విస్తున్నాను. కరోనా కాలంలో ఇండియా కనీసం 150 దేశాలకు మందులను సరఫరా చేసింది. ఇక్కడి ఫార్మా కంపెనీలు ప్రపంచానికి బాసటగా నిలిచాయంటే అతిశయోక్తికాదు. భూగోళానికి పెనుసవాలుగా పరిణమించిన కరోనాపై మనమంతా ఉమ్మడిగా పోరాడుదాం.. "అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత్ - యురోపియన్ యూనియన్(ఈయూ) మధ్య ఇప్పటికే కొనసాగుతున్న బంధాలు.. రాబోయే రోజుల్లో మరింత బలోపేతం అయ్యేలా ముందుకుపోదామని, అందుకోసం దీర్ఘకాలిక వ్యూహాలు, నిర్మాణాత్మక అజెండాను మనం రూపొందించుకోవాలన్నారు. భారత్-ఈయూ సహజ మిత్రులని, ఇద్దరి లక్ష్యాలు, ఆలోచనలు దగ్గరిగా ఉంటాయని, ప్రపంచ శాంతి, స్థిరత్వానికి స్నేహం చాలా అవసరమని, ఇవాళ్టి సవాళ్ల కాలంలో అది మరింత ప్రస్ఫుటంగా అర్థమవుతున్నదని చెప్పారు.

ప్రతిష్టాత్మక భారత్- యురోపియన్ యూనియన్ 15వ సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రసంగించారు. కరోనా విలయం కారణంగా వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సదస్సులో భారత ప్రతినిధి బృందానికి మోదీ నాయకత్వం వహించగా, యురోపియన్ యూనియన్ తరఫున 'యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్' చార్లెస్ మైకెల్, 'యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్' ఉర్సులా వాన్ డెర్ లెయాన్ ప్రాతినిధ్యం వహించారు. నిజానికి ఈ సదస్సు మార్చిలోనే జరగాల్సి ఉన్నా, అనివార్యకారణాల వల్ల రద్దయి, నాలుగు నెలలు ఆలస్యంగా జరిగింది.

దస్సులో పాల్గొనడానికి ముందు ప్రధాని నరేంద్ర మోదీ తన

తరువాయి 2లో..

# విశాఖ సాల్వేంట్ కంపెనీని సందర్శించిన విజయసాయిరెడ్డి

### ప్రమాదానికి గల కారణాలును అధికారులను, కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్న ఎంపీ విజయసాయిరెడ్డి



పరవాడ : మండల కేంద్రమైన పరవాడలో గల జెఎన్‌పిసి లో ఇటీవలే ప్రమాదం జరిగిన విశాఖ సాల్వేంట్ కంపెనీని బుధవారము వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలును అధికారులను, కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్య క్రమంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతిమ్మ, వైజాగ్ ఎంపీ ఎమ్‌వివి.సత్యనారా యణ, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్‌రాజ్, అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,పోలీసు కమిషనర్ అర్కే మీనా, వైసీపీ సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు, పెందుర్తి వైసీపీ ఇంఛార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పరవాడ వైసీపీ జెడ్పిటిసి అభ్యర్థి పైల సన్యాశిరాజు, ఎమ్మార్వో పివిఎల్ ఎన్.గంగాధర్‌రావు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైసీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ సిరపురపు అప్పల నాయుడు, పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పైల జూనియర్ అప్పలనాయుడు, బొద్దపు చిన్నారావు, వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు పెదిశెట్టి శేఖర్, గొర్లి గోపి, గెడ్డం ఉమా, నదియా తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు బ్యాంకులు

# సహకరించాలి

### వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు



అమరావతి: రుణం తీసుకునే కౌలు రైతులకు బ్యాంకులు సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం ఆయన ఏపీ సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. కేబినెట్ సమావేశంలో కౌలు రైతుల రుణ పరిమితిపై చర్చించామని తెలిపారు. ఏపీలో అన్ని చోట్ల సకాలంలో వర్షాలు పడుతున్నాయని వెల్లడించారు. ఈ ఖరీఫ్ సీజన్ చాలా ఆశాజనకంగా ఉందన్నారు. సాధారణం కన్నా 51 శాతానికి పైగా వర్షం వచ్చిందన్నారు. ఏపీ రిజర్వాయర్లలో కూడా నీటి లభ్యత స్థితి కూడా చాలా బాగుందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపు వల్లే ఈసారి విత్తన సమస్యలు లేవని మంత్రి అన్నారు. చరిత్రలో మొదటిసారిగా పొగాకు కొనుగోళ్లను ప్రారంభించామని చెప్పారు. ఇందుకోసం రూ. 200 కోట్లు కేటాయించేందుకు సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు

## వెనక్కి తగ్గిన ట్రంప్ సర్కార్..

# భారతీయ విద్యార్థులకు ఊరట



హైదరాబాద్: ఆన్‌లైన్ ద్వారా క్లాసులకు హాజరవుతున్న విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేయాలని జూలై 6వ తేదీన అమెరికా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ట్రంప్ సర్కార్ ఇప్పుడు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నది. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల నుంచి ఆందోళనలు వ్యక్తం కావడంతో.. అమెరికా ప్రభుత్వం వివాదాస్పద వీసా విధానాన్ని రద్దు

తరువాయి 2లో..




## 24 గంటల్లో 3,20,000

# కోవిడ్ టెస్టులు!

### ఐసీఎంఆర్

### దేశంలో కోటి 24లక్షల శాంపిళ్లకు కరోనా టెస్టులు పూర్తి

### భారత వైద్య పరిశోధన మండలి వెల్లడి

దిల్లీ : దేశంలో కరోనా వైరస్ మహమ్మారి విజృంభణతో కరోనా నిర్ధారణ పరీక్షలు భారీగా చేపట్టడం అనివార్యమయ్యింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నిత్యం కొవిడ్ నిర్ధారణ పరీక్షలను ఎక్కువ మొత్తంలో చేపడుతున్నాయి. దీనిలోభాగంగా నిన్న ఒక్కరోజే దేశవ్యాప్తంగా 3,20,161 శాంపిళ్లకు

తరువాయి 2లో..

## 60 లక్షల మంది సబ్‌స్క్రైబర్లకు

# ఫైబర్ నెట్ సేవలు

### - మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి



అమరావతి: చౌకగా ఇంటర్నెట్‌తో పాటు, నాణ్యతగా ఫైబర్ నెట్ సేవలందించడమే లక్ష్యమని పరిశ్రమ లు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అన్నారు. ఫైబర్ నెట్‌కు ఉన్న డిమాండ్ నేపథ్యంలో రానున్న 2-3 ఏళ్ల కాలంలో 60 లక్షల మంది సబ్‌స్క్రైబర్లకు ఫైబర్ నెట్ సేవలు అందిస్తామన్నారు. ఇప్పటికే 10 లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నార న్నారు. అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా దశలవారీగా కొత్త సబ్‌స్క్రైబర్లను పెంచుతా మన్నారు. బుధవారం మంత్రి తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్)పై సమీక్ష నిర్వహించారు. ఈ

తరువాయి 2లో..

# ఆర్టీసీ డ్రైవింగు స్కూల్ శిక్షణకు సిద్ధం

*- ఆగష్టు 1వ తేదీ నుండి మొదటి బ్యాచ్ - శిక్షణ ఫీజు రూ.15,000/-*



శ్రీకాకుళం : శ్రీకాకుళం ఆంధ్ర ప్రదేశ్ ప్రజా రవాణా శాఖ హెవీ వెహికల్ డ్రైవింగు స్కూల్ ద్వారా శిక్షణ కల్పించుటకు సిద్ధం చేసామని డిప్యూటి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆగష్టు 1వ తేదీ నుండి మొదటి బ్యాచ్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. 20 మంది అభ్యర్థులతో బ్యాచ్ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. హెవీ వెహికల్ డ్రైవింగులో ఆసక్తిగల అభ్యర్ధులు శ్రీకాకుళం డిపో -1 కార్యాలయంలో హెవీ వెహికల్ డ్రైవింగుకు దరఖాస్తు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఇందులో 16 రోజులు బోధనా తరగతులు ఉంటాయని ఆమె చెప్పారు. 16 రోజులు బస్సుపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తామని వరలక్ష్మి చెప్పారు. 40 రోజుల శిక్షణా కాలంలో విధిగా 32 రోజుల హాజరు ఉండాలని ఆమె స్పష్టం చేసారు. శిక్షణ కాలం పూర్తి చేసుకున్న అభ్యర్ధులకు డ్రైవింగు సర్టిఫికేట్ జారీ చేస్తామని తెలిపారు. హెవీ డ్రైవింగు శిక్షణకు అభ్యర్థులకు 20 సంవత్సరాలు నిండి తగిన శరీర ధారుడ్యం కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, లైట్ మోటార్ వెహికల్ (ఎల్.ఎం.వి) లైసెన్సు పొంది సంవత్సర కాలం పూర్తి చేసుకుని, హెవీ వెహికల్ ఎల్.ఎల్.ఆర్ డ్రైవింగు లైసెన్సు కలిగి ఉన్న అభ్యర్ధులు అర్హులన్నారు. శిక్షణ ఫీజు జి.ఎస్.టితో సహా రూ.15 వేలుగా నిర్ణయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వివరములకు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ 995925605, డిపో మేనేజర్, శ్రీకాకుళం-1 - 9959225608, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) 7382921647 నంబర్లకు సంప్రదించ వచ్చని ఆమె సూచించారు.

# పీఎంపాలెం లో నత్తనడకన కల్వర్ట్ పనులు



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి 6 వ వార్డు పీఎం పాలెం మొదటి బస్టాప్ వద్ద సుమారు ఇరువై రోజుల క్రితం డ్రైనేజీ పనులు ప్రారంభించారు. అయితే 80 ఫీట్ మెయిన్ రోడ్ మీద కాలువలు మరమ్మత్తుల నిమిత్తం కల్వర్టులను తవ్వి పనులు పూర్తి చెయ్యకుండా కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, జోన్ 1 జీవీఎంసీ సిబ్బంది అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు అనేక ఇబ్బందులను కలిగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. జోనల్ కమిషనర్ కూడా ఇదే రహదారిపై ప్రయాణిస్తున్న కనీసం దీనిపై దృష్టి సారించటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ కల్వర్టు సమీపంలో మూడు రోడ్ల కూడలి ఉండగా కనీసం స్పీడ్ బ్రేకర్ లేక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని,నిత్యం ఇదే రహదారిపై వందలాది వాహనాలు ఇటుగా ప్రయాణం సాగిస్తున్నాయని, ఇదే కొనసాగితే అనేక ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేసారు. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ మరియు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి పనులు త్వరగా పూర్తి చెయ్యాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సీతారామ్‌నగర్‌లో హైపోక్లోరైడ్ పిచికారీ




గాజువాక : జీ.వీ.ఎం.సి 72 వ వార్డు పరిధి లోని సీతారామ్ నగర్ లో ఒక ఉద్యోగికి కరోనా వైరస్ రావడంతో పరిశుభ్రతలో భాగంగా సీ.పీ.ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ తనవంతు బాధ్యతగా సీతారామ్ నగర్ లోని పలు వీధులలో బుధవారం సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ విజృంభించడంతో కరోనా వైరస్ బారిన పడిన ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారనిఅన్నారు. కరోనా వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు పుర్రి సత్యనారాయణ, బి.వై.సత్యారావు, శ్రీనివాస్, బసవేశ్వరరావు, గోవింద్, మట్టపర్తి వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణ స్వామి అర్చకులకు కరోనా పరీక్షలు



శ్రీకాకుళం : కోవిడ్ 19లో భాగంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పనిచేస్తున్న అర్చకులకు బుధ వారం కరోనా పరీక్షలు నిర్వహించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.రమణ పర్యవేక్షణలో తహశీల్దారు దిలీప్ చక్రవర్తి, వైద్య అధికారులు డా.అప్పరావు, లింగరాజు వర్మ తదితరులు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.హరిసూర్య ప్రకాష్ , ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## తుదిదశకు నాడు-నేడు పనులు

కొత్తూరు : అనకాపల్లి మండలం, పట్టణ పరిధిలోని దాదాపుగా అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులు తుదిదశకు చేరుకున్నాయని పంచాయతీరాజ్ డీఈ ఇంజనీర్ వేణుగోపాలరావు పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలో నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని 34 పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయన్నారు. జులై 15 నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. నిర్మాణాలు పూర్తయితే తుది మెరుగులు దిద్ది ఈ నెలాఖరు నాటికి శతశాతం పూర్తి చేస్తామన్నారు. కరోనా, ఇసుక కొరత, కార్మికులు పనులకు రాకపోవడం తదితర సమస్యలతో పనులు కాస్త ఆలస్యం అయ్యాయని తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

# ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుకు కమిటీ

ఈ కమిటీలో సీసీఎల్‌ఏ కమిషనర్, జీఏడీ సర్వీసుల సెక్రటరీ, ప్లానింగ్ విభాగం సెక్రటరీ, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రతినిధి, కన్వీనర్‌గా ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో 25 జిల్లాల ఏర్పాటుకు కమిటీ అధ్యయనం చేయనుంది.

సంప్రదాయేతర కరెంట్ ఉత్పత్తి, ప్రాజెక్టులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో రెన్యుబుల్ ఎనర్జీ ఎక్స్‌పోర్ట్ విధానం 2020కి కేబినెట్ ఆమోదం తెలిపింది. రైతులకు పగటిపూట ఉచిత కరెంట్ ఇచ్చేలా ప్రాజెక్టులు రూపొందించనుంది. రాయలసీమ ప్రాజెక్ట్‌ల సామర్థ్యం పెంపు, కాలువల విస్తరణ పనుల కోసం ఎస్‌పీవీ

ఏపీ ఆర్‌ఎస్‌డీఎమ్‌పీసీఎల్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అదే విధంగా కేపిటల్ ఔట్ లే రూ.40 వేల కోట్లు, గండికోట ప్రాజెక్ట్ నిర్వాసితుల కోసం 145.94 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపింది.

గుంటూరులో ముస్లిం యువకులపై పెట్టిన కేసుల ఉపసంహరణకు ఆమోదం

## స్నేహంతోనే శాంతి వర్ధిల్లుతుంది

ట్విటర్ ఖాతాలోనూ సంబంధిత అంశాలను ప్రస్తావించారు. ఈ సదస్సు ద్వారా.. 27 దేశాల కూటమి అయిన యురోపియన్ యూనియన్(ఈయూ)తో భారత్ సంబంధాలు ఇంకాస్త బలపడతాయని, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సంబంధాలు మరింత పెరుగుతాయన్న నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్-ఈయూ చాలా విషయాల్లో సారూప్యంగా ఉంటాయని, అంతర్జాతీయ సంస్థలను గౌరవించడంలో, ప్రజల హక్కుల్ని, కాపాడుకోవడంలో, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోడానికి ప్రాధాన్యం ఇస్తాయని, ఆర్థిక, సాస్కృతిక రంగాల్లో ఇంకాస్త దగ్గర కావడానికి భారత్ సర్వదా సిద్ధంగా ఉంటుందని సదస్సులో ప్రసంగిస్తూ మోదీ చెప్పారు. ఈ సందర్భంగా 'యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్' ఉర్సులా మాట్లాడుతూ.. ''రెండేళ్ల కిందట ఇండియాకు వచ్చినప్పుడు మీ ఆతిథ్యం గుర్తుంది. మళ్లీ మిమ్మల్ని నేరుగా కలవలేకపోతున్నందుకు బాధగా ఉంది. 2022 నాటికి 75వ స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకోబోతున్న భారత్ తన లక్ష్యాలు సాధిస్తుందన్న నమ్మకముంది'' అని అన్నారు. అందుకు ధన్యవాదాలు చెప్పిన మోదీ, ''అవును, కరోనా వల్ల మనం నేరుగా కలవలేకున్నా, వర్చువల్ గానైనా భేటీ కావడం సంతోషం'' అని బదులిచ్చారు.

### వెనక్కి తగ్గిన ట్రంప్ సర్కార్.. భారతీయ విద్యార్థులకు ఊరట

చేసింది. కరోనా వైరస్ నేపథ్యంలో చాలా వరకు విద్యాసంస్థలు ఆన్‌లైన్ పాఠాలకు మొగ్గుచూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ సర్కార్ ఓ కీలక ఆదేశం జారీ చేసింది. ఆన్‌లైన్ పాఠాలు వింటున్న విదేశీ విద్యార్థులు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఆ నిర్ణయం పట్ల హార్వర్డ్, మసాచుసెట్స్ యూనివర్సిటీలు.. కోర్టులో దావా వేశాయి. అమెరికా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)పై కేసును ఫైల్ చేశాయి. ఈ నేపథ్యంలో తమ నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. విదేశీ విద్యార్థులు దేశం విడిచి వెళ్లాలంటూ ఐసీఈ జారీ చేసిన ఆదేశాలను తక్షణమే నిలిపివేయాలని హార్వర్డ్, మిట్ వర్సిటీలు కోర్టును కోరాయి. ప్రభుత్వం నిర్ణయం వల్ల విద్యార్థులు వ్యక్తిగతంగా, ఆర్థికంగా దెబ్బతినే ప్రమాదం ఉన్నదని వర్సిటీలు తమ పిటిషన్‌లో ఆరోపించాయి. ట్రంప్ సర్కార్ వెనక్కి తగ్గడం.. ఒకరకంగా భారతీయ విద్యార్థులకు సంతోషకరమైన విషయమే.

## 60 లక్షల మంది సబ్‌స్క్రైబర్లకు ఫైబర్ నెట్ సేవలు

సందర్భంగా గ్రామ పంచా యతీ, మండలాల్లో రూటర్ల సంఖ్య వీలైనంత వరకూ తగ్గించడంపై దృష్టి పెడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా ఉండేలా చూడడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రజలందరికీ అందుబాటులోకి ఇంటర్నెట్ తెస్తామన్నారు. నిర్దేశించుకున్న గ్రామపంచాయతీలు, మండలాలలో పక్కాగా ఫైబర్ నెట్‌వర్క్ సేవలు అందుతాయని స్పష్టం చేశారు. రూటర్ల ఇన్‌స్టాలేషన్‌లో మరింత పారదర్శకతతోపాటు, కొత్త పరికరాల సేకరణ, అంచనా, ఆర్థిక భారం తగ్గించేందుకు 'టెక్నికల్ కమిటీ' ఏర్పాటు చేశామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఎండీ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## 24గంటల్లో 3,20,000 కొవిడ్ టెస్టులు!

కరోనా నిర్ధారణ పరీక్షలు చేపట్టినట్టు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) వెల్లడించింది. ఒకేరోజు ఈ స్థాయిలో పరీక్షలు చేపట్టడం ఇదే తొలిసారి. దీంతో ఇప్పటివరకు 1,24,12,664 నమూనాలను పరీక్షించినట్లు ఐసీఎంఆర్ తెలిపింది.

కొవిడ్ నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వం దేశవ్యాప్తంగా కేంద్రాల సంఖ్యనూ పెంచుతోంది. మార్చి తొలివారంలో దేశంలో వంద కరోనా నిర్ధారణ కేంద్రాలుంటే ప్రస్తుతం ఆ సంఖ్య 1226కు చేరినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వీటిలో 865 ప్రభుత్వ కేంద్రాలు ఉండగా మరో 358 కేంద్రాలు ప్రైవేటు నిర్వహణలో ఉన్నాయి. ఆర్‌టీ-పీసీఆర్ 633, ట్రూనాట్ 491, సీబీనాట్ 99 ల్యాబ్‌లలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నారు. ముఖ్యంగా తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు భారీ స్థాయిలో పరీక్షలు చేపడుతున్నాయి.

అమెరికాలో 4.5కోట్ల టెస్టులు..

ప్రపంచంలోనే అత్యధికంగా కొవిడ్ నిర్ధారణ పరీక్షలను అమెరికా చేపడుతున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఇప్పటివరకు అమెరికాలో నాలుగున్నర కోట్ల మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ట్రంప్ వెల్లడించారు. దీంతో అమెరికాలో పాజిటివ్ కేసుల సంఖ్య 34లక్షలకు చేరినట్లు తెలిపారు. అమెరికా చేస్తున్నట్లుగా కరోనా పరీక్షలు నిర్వహిస్తే చైనా, బ్రెజిల్, రష్యా, భారత్ దేశాల్లో పాజిటివ్ కేసుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉందని మరోసారి ట్రంప్ అన్నారు. బ్రెజిల్‌లో వైరస్ తీవ్రత ఆందోళనకర స్థాయిలో ఉన్నట్లు ట్రంప్ అభిప్రాయపడ్డారు.

# ఉద్యోగ ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులు రద్దుపై హర్షం

**ఏపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి త్రినాథస్వామి**

అచ్యుతాపురం : ఉద్యోగ ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథస్వామి హర్షం వ్యక్తం చేశారు . బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు . చందా పింఛన్ రద్దు కోరుతూ గత సంవత్సరం జనవరి 31 తేదిన ఏపిసిపిఎస్ఈఎ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రకాశం బ్యారేజ్ నుండి చలో అసెంబ్లి కార్యక్రమం చేపట్టినందుకు ఉద్యోగ ఉపాధ్యాయులపై బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు . ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో గల 2 లక్షల సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల తరపున ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు .అదే విధంగా సిపిఎస్ ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగుల కుటుంబాలలో వెలుగు నింపాలని కోరారు .తను పాలనాగరాజు ఎట్ల నారు.తమ ట్రస్ట్ ద్వారా వార్డ్ ప్రజలందరికీ నిత్యావసరాలు,కూరగాయలు పంపిణీ చేశామని, అవసరమైన,కష్టాల్లో ఉన్న పేదలకు ఇంకా సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నామని నాగరాజు తెలియచేసారు.పేదలకు సేవ చేసేందుకే ట్రస్ట్ స్థాపించినట్లు కందుల పునరుద్ఘాటించారు.



# విశాఖ సాల్వెంట్ ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

**- సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి**



లంకెలపాలెం : జవహర్ లాల్ నెహ్రు ఫార్మాసిటీ పర్యవేక్షణ సంస్థ రామ్ కి నడుపుతున్న విశాఖ సాల్వే%శీ%ట్ కంపెనీలో సోమవారం రాత్రి 10.30 ని జరిగిన భారీ అగ్నిప్రమాదం కేవలం యాజమాన్య నిర్లక్ష్యం వలనే జరిగిందని ఫార్మాసిటీ స్టాఫ్, వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యాన్నారాయణ ఆరోపించారు. కంపెనీ యాజమాన్యం పై పోలీసు కేసుపెట్టి అరెస్ట్ చేయాలని లంకెలపాలెంలో కార్మికులతో కలిసి నిరసన రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ సాయినార్ ఫార్మా గ్యాస్ లీక్ లో ఇద్దరి మృతి చెందిన ఘటన మరవక ముందే విశాఖ సాల్వే%శీ%ట్ ప్రమాదం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది అని కార్మికుల ప్రాణాలకు ఫార్మాలో భద్రత లేదు అని మరోసారి రుజువు అయ్యిందన్నారు. ఫార్మాసిటీ ని అభివృద్ధి చేయు సంస్థ గా ఉన్న రామ్ కి ఫార్మా కంపెనీలలో భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చూడటంలో విఫలమైందని ఆరోపించారు. ఫార్మా లో జరుగుతున్న ప్రమాదాల నివారణా బాధ్యత రామ్ కి దే అని కానీ రామ్ కి ఆ భాద్యతలో విఫలం అయిందని అన్నారు. విశాఖ సాల్వే%శీ%ట్ లో జరిగిన ప్రమాదం ఫార్మాలో ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో కన్నా పెద్ద అగ్నిప్రమాదం అని అన్నారు. సకాలంలో అగ్నిమాపక దళాలు ప్రమాద స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని అరికట్ట గలిగారు కానీ లేకపోతే ఈ కంపెనీలో జరిగిన భారీ పేలుళ్లకు ఇతర కంపెనీలకు వ్యాపిస్తే జరిగే పరిస్థితులు ఊహిస్తే ఒళ్ళు జలదరిస్తోందని ఆవేద వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు కార్మికుల రక్షణకోసం వారిని పరామర్శించడానికి వచ్చే మమ్మలని,ఇతర పార్టీ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్ కి పోలీసులు తీసుకు వెళుతున్నారు. కానీ పోలీసులు మాత్రం ప్రమాదాలకు కారణం అవుతున్న కంపెనీ యజమాన్యాలకు అడుగులకు మడుగులెత్తుతున్నారని ఆరోపించారు. విశాఖ సాల్వే%శీ%ట్ లో నిల్వ ఉన్న కెమికల్ వ్యర్ధాలలో రియాక్షన్ జరిగి ప్రమాద రహిత వాయువులు(గ్యాస్)రాకుండా ఉండటానికి అందులో కొన్నిరకాల ద్రావణాలను కలుపుతారు అని ఆ ప్రమాద నివారణా ద్రావకాల యొక్క పరిమాణం తగ్గటం వలన రసాయనాల ట్యా%శీ%క్ లో ఏర్పడిన అధిక ఉష్ణోగ్రత తో ఈ అగ్నిప్రమాదం జరిగింది అని అధికారులు సూచన ప్రాయంగా తెలియ చేశారని గనిశెట్టి అన్నారు.

వ్యర్థ ట్యాంకులలో ఏర్పడుతున్న అధిక ఉష్ణోగ్రతల వలన పొగలు వస్తున్న విషయం కంపెనీ యాజమాన్యానికి తెలిసినా కూడా ఎటువంటి నివారణా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉందని, ఇంత పెద్ద ప్రమాదానికి కారణం అయిన యాజమాన్యం పై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని సత్యన్నారాయణ డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలలో పనిచేసే కార్మికులు తమ ప్రాణాలను గుప్పెటలో పెట్టుకుని పని చేయవలసి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. వీరే కాకుండా నిర్వాసిత గ్రామాలలోని ప్రజలు కూడా వరుస ప్రమాధాలతో భయ బ్రాతులు అవుతున్నారని,విశాఖ సాల్వే%శీ%ట్ ప్రమాదం లో ఏర్పడిన విస్ఫోటన శబ్ధాల వలన తాడి,తాణా%శీ%,పరవాడ గ్రామాల్లోన్ని ప్రజలు రోడ్ల మీదకు పరుగులు తీశారు అంటే ప్రమాద తీవ్రత అంత ఎక్కువ ఉందని అన్నారు. ఈ ప్రమాదంలో మృతునికి కోటి రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలి అని అలాగే గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలతో పాటు 30 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.వెంకటరావు, పి.చిరంజీవి,ఎమ్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్కుతో ఆటలొద్దు..

# కరోనాను ఆహ్వానించవద్దు



కాకినాడ : దేశవ్యాప్తంగా కరోనా కేసుల ఉధృతి రోజురోజుకు పెరుగుతోంది. కరోనా వ్యాప్తి పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు.ఇప్పటికీ ప్రజల్లో వైరస్ వ్యాప్తిపై పూర్తి స్థాయి అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్న భావన కలుగుతోంది. ముఖ్యంగా జనసంవర్ధమైన ప్రాంతాల్లోకి వచ్చేటప్పుడు ముఖానికి మాస్కు ధరించడం లేదు. మరికొంత మంది మాస్కులు ధరించినా.. వాటిని వినియోగించడంపై సరైన అవగాహన లేకపోవడం, మాస్కును నిమిషానికి ఒకసారి తడుముకోవడం,కిందకు లాగడం,పైకి పెట్టడం,ముక్కు కిందకు లాగడం మెడపైన, తలపైన ఉంచడం చేస్తున్నారు.మరికొందరు వాటిని జనం సమూహాల్లోనే ఎక్కడపడితే అక్కడ తీసేస్తూ..ముఖాన్ని చేతులతో తుడుచుకుని మాస్కును తిరిగి పెట్టుకుంటున్నారు.ఇలా నిర్లక్ష్యంగా ఉండడం వల్లే వైరస్ వ్యాప్తి మరింత పెరుగుతోంది.మరోవైపు కొంతమంది మాత్రం తాము చాలా జాగ్రత్తగా ఉంటున్నామని.. అయినా వైరస్ బారిన ఎలా పడ్డామో తెలియడం లేదని చెబుతున్నారు. కానీ వారికి తెలియకుండానే చాలా పొరపాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా నగరాల్లో మాస్కులు ధరిస్తూనే ప్రజలు చేస్తున్న పొరపాట్లను ఇక్కడ వివరించడం జరుగుతోంది. మాస్కులను ధరించే ప్రతిఒక్కరూ వీటిని గమనించి కరోనా వ్యాప్తిని అరికట్టడంలో తమవంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాస్కు తప్పనిసరిగా ధరించాలని ప్రభుత్వం పదేపదే చెపుతున్నా కొంతమంది నిర్లక్ష్యం కోవిడ్ కేసులు పెరుగుదలకు కారణమవుతోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు మాస్కు ధరించని వారికి జరిమానా విధిస్తున్నా ప్రజలలో మార్పు రావడం లేదు. బయటకు వచ్చినప్పుడు విధిగా మాస్కు ధరించడం కనీస బాధ్యతగా భావించాలి.

# బాలుడికి వైద్యసహాయం అందించిన సందీప్ పంచకర్ల



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి 7 వార్డు వాంబే కాలనీ లో నివాసముంటున్న జనసేన కార్యకర్త తిరుపతి రావు కుమారుడు దర్శన్ కుమార్ (6 సం) గత కొన్ని సంవత్సరాలుగా దీర్ఘ కాలిక మెదడు వ్యాధి తో బాధపడుతున్నాడు.

అయితే ఈ సమాచారం తెలుసుకున్న జనసేన భీమిలి నియోజకవర్గ ఇంచార్జి డా. సందీప్ పంచకర్ల మంగళవారం సాయంత్రం తిరుపతి రావు ఇంటికి చేరుకొని మెడికల్ రిపోర్ట్స్ ని పరిశీలించి,

అనంతరం సంబంధిత వైద్య నిపుణులతో మాట్లాడి 14 వేల రూపాయలు చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులూ బివి కృష్ణయ్య,శేఖరి శ్రీనుబాబు,నాగోతి నాయుడు, ప్రసాద్ కుబిరెడ్డి,సంతోష్ బరాటం తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ కోవిడ్ -19



విశాఖసిటీ : రాష్ట్ర డి.జి.పి గౌతమ్ సవాంగ్,ఐ.పి.ఎస్., వారి ఆదేశాలతో నగర పోలీస్ కమిషనర్ ఆర్. కే. మీనా, ఐ.పి.ఎస్., ఆధ్వర్యంలో నగర పరిధిలో ఆపరేషన్ ముస్కాన్, కోవిడ్-19 లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం లో బుధవారం 16 మంది బాలురును గుర్తించడం జరిగినది. వీరిని సిడబ్ల్యూసి ఛైర్ పర్సన్ మరియు లేబర్ ఆఫీసర్ ముందు హాజరు పరిచి కోవిడ్-19 లక్షణాలు ఉన్న పిల్లలకు కోవిడ్-19 పరీక్షలు నిర్వహించారు. తదుపరి వారి తల్లితండ్రుల వద్దకు పంపడం లేదా తల్లి తండ్రి లేని వారిని వసతి గృహంలో అప్పగించడం జరిగినది.

# కాపు ఉద్యమ నేతగా ముద్రగడ కొనసాగాలి

# ముద్రగడ వెంటే కాపులు

## విశాఖ సిటీ కాపునాడు వెల్ఫేర్ అసోసియేషన్



విశాఖపట్నం: కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం కొనసాగాలని, ముద్రగడ లేని ఉద్యమాన్ని ఊహించలేమని విశాఖ సిటీ కాపునాడు వెల్ఫేర్ అసో సియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు గుంటూరు వెంకట నరసింహారావు, వంగా వెంకట ప్రభాకార్ చెప్పారు. విశాఖలో బుధవారం వారు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబ్ధతకు నిదర్శనం ముద్రగడ పద్మ నాభం అని తెలిపారు. కాపు జాతికి నాయకత్వ లేమి కల్పించాలని కొందరు చేస్తున్న కుట్రలను కాపునాడు అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుం దన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ముద్రగడను కించపరిచే విధంగా చేస్తున్న ప్రచారాలను ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ముద్రగడ ద్వారానే కాపులకు బిసి రిజర్వేషన్ సాధ్యం అని స్పష్టం చేశారు. కాపులకు బిసి రిజర్వేషన్ సాధించే వరకు తాను ఇంట్లో ఏ పండగ చేసుకోనని చెప్పిన విషయాన్ని కాపులు గుర్తు పెట్టుకోవాలన్నారు. అటువంటి పై వ్యక్తిపై అసత్య తప్పుడు వార్తలతో అవమానం పరచడం సరికాదని హితవు పలికారు. కాపు జాతి ఉన్నతికి చేసిన ప్రయత్నాలు త్యాగాలు యావత్తూ కాపు జాతిని జాగృత పరిచాయిన్నారు. కాపు జాతికి జవసత్వాలు నింపి యావత్ కాపు జాతిని ఏకికృతం చేసిన వ్యక్తి ముద్రగడ అని చెప్పారు.జాతిని ఉద్యమం వైపు నడిపి ఎన్నో కష్ట నష్టాలు అవమానాలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. జాతి కోసం రాజకీయ జీవితం, ఉన్నత పదవులు త్యాగం చేసిన వ్యక్తిపై నిందారోపణలు చేయడం తగదని వ్యక్తి స్వార్థం కోసం చేసే ఇటువంటి చర్యలు జాతిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయిన్నారు.

# పుత్తడిగైరంపేటలో పర్యటించిన ఎంపిడిఒ

గొలుగొండ : గొలుగొండ ఎంపిడిఒ డేవిడ్‌రాజు బుధవారం మండలంలోని పుత్తడిగైరంపేటలో పర్యటించి పారిశుద్య పనులు పరిశీలించారు. మూడు రోజుల నుండి గ్రామంలో ప్రతీ వీధిలో పారిశుద్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పత్తి రమణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో హైడ్రోక్లోరిన్ ద్రవం పిచికారీ



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి 6 వ వార్డు లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు భీమిలి వైస్సార్సీపీ ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్ ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు తో కలిసి వార్డులో ఉన్న అన్ని మతస్థుల ప్రార్ధన మందిరాల్లో బుధవారం హైడ్రోజన్ ద్రావణాన్ని పిచికారీ చేసారు. మధురవాడలో covid కేసులు పెరుగుతున్న దృష్ట్యా తగు చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే మహమ్మారిని వ్యాపించకుండా అడ్డుకట్ట వేయాలని,

అదే విధంగా కోవిడ్ - 19 నిబంధనలను పాటిస్తూ ఆగష్టు ఒకటో తేదీ నుంచి రాష్ట్రం లోని అన్ని పర్యాటక ప్రాంతాలను తెరిచి సందర్శకులను,పర్యాటకులను అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకొని అనుమతిస్తామని మంత్రి తెలిపినట్లు తెలిపారు.

# 75వ వార్డు గ్రామ వాలెంటర్లకు నిత్యావసర వస్తువులు పంపిణీ



గాజువాక : జీవీఎంసీ 75వవార్డు లో జిల్లా వైసీపీ విద్యార్థి విబాగం అద్యక్షలు తిప్పల వంశీ రెడ్డి, గాజువాక నియెజకవర్గ ఇన్ చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి పాల్గొని గ్రామ వాలెంటర్లుకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేసారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంశీ రెడ్డి, దేవన్ రెడ్డిలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే పెద్ద చదువులు చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న వారిచే సేవా కార్యక్రమాలు చేయుస్తు సుమారు 4 లక్షల మంది నిరుద్యోగులకు గ్రామవాలెంటర్లు, గ్రామ సచివాలయం ద్వారా ఉద్యోగాలు కల్పించి యువతను ఆదుకొవటం జరిగిందన్నారు. గ్రామ వాలెంటరి వ్యవస్థ ద్వార కరోనా కట్టడిలో మీ ప్రాణలకు తెగించి చేసిన సేవా కార్యక్రమాలు దేశంలోనే మంచి గుర్తింపు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి వై యస్ జగన్ మెహన్ రెడ్డి గారికి మంచి పేరు వచ్చే విదంగా ఏవిదమైన అవకతవకలు,అవినీతి చేయుకుండా, అన్ని సంక్షేమ పధాకాలు ఇంటింటి వెళ్ళి అందరకు అందేటట్లు సేవలను అందిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్డుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి శ్రీనువాసరెడ్డి (బుజ్జీ) పిట్టా రెడ్డి గోందేశి నాగిరెడ్డి, సీ ఓ ఉదయ భాస్కర్ , దర్మపురి చక్రీ, పిట్టా హరి, 75 వ వార్డు వాలెంటర్లు పిట్టా మమత, దుర్గ మోనిక, తదితరలు పాల్గోన్నారు.

# భాగ్యలక్ష్మి అనసూయదేవీలకు అభినందనలు



ములగాడ: కోవిడ్-19 సమయంలో వందరోజులలో 100 వెబినార్స్ పాల్గొని ఒక్కొక్కరు100 ప్రశంసపత్రాలు పొందిన సందర్భంగా సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులైన ఇపిఎస్ భాగ్యలక్ష్మి, వై. అనసూయదేవిలను బుధవారం సెయింట్ ఆన్స్ యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడతూ 100 రోజులలో ఇంతటి ఘన వియజయాన్ని సాధించడం అద్భుతమని కొనియాడారు.

ఇరువురు నేర్చుకున్న నూతన విషయాలను విద్యార్థుల అభివృద్ధి కి,ప్రజల చైతన్యానికి ఉపయోగించాలని కోరారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కారోన వలన ఇంటిదగ్గరే ఉండి దేశంలో వివిధ కళాశాలలు నిర్వహించిన పలు ఆన్లైన్ కార్యక్రమాలలో పాల్గొని పలు ప్రశంసా పత్రాలను పొందడం ఆనందంగా ఉందని అన్నారు. అనసూయదేవి మాట్లాడుతూ ఇద్దరం అక్కచెల్లలం ఈ కార్యక్రమంలో పాల్గొని అరుదైన రికార్డ్ నమోదు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. వీరిని సెయింట్ ఆన్స్ యాజమాన్యంతో పాటు విశాఖలోని పలు కళాశాలలు, జాతీయ సేవ పథక యూనిట్లు, ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు అభినందనలతో ముంచెత్తారు.

# ప్రైవేట్ టీచర్లకు కరోనా కష్టాలు

భీమునిపట్నం : భీమిలి జోన్ ప్రైవేట్ టీచర్స్ ,లెక్చరర్స్ యూనియన్ ఉపాధ్యాయులు భీమిలి ప్రెస్ క్లబ్ లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.భీమిలి జోన్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 5 లక్షలు ప్రైవేట్ టీచర్లు ,లెక్చరర్లు ,నాన్ టీచింగ్ సిబ్బంది లాక్ డౌన్ కారణం గా తీవ్ర ఆర్ధిక సమస్యలు తో రోడ్డున పడుతున్నారని ముఖ్యమంత్రి మిగతా ఉపాధి వర్గాలు వారికి అదుకున్న విధంగా టీచర్స్ ని ఆదుకోవాలి అని భావితరాలు ని అందించే ఉపాధ్యాయులు ఆకలి చావులు తో చనిపోతున్నారని ముఖ్యమంత్రి స్పందించి ఉపాధ్యాయులు కి నెలకు పదివేలు భృతి ఇచ్చి ఆదుకోవాలని ,ఉపాధ్యాయులు కి ఉద్యోగ భద్రత కల్పించాలని ,ప్రైవేట్ ఉపాధ్యాయులు ని ప్రభుత్వం గుర్తుంచి అండగా నిలవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో భీమిలి జోన్ ప్రైవేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు వాండ్రసి సతీష్ కన్వీనర్ ఉప్పల నవీన్,ట్రెజరర్ పి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ జోన్‌లను పరిశీలించిన అధికారులు

భీమునిపట్నం : కరోనా రోజు రోజుకి పెరుగుతున్న నేపధ్యంలో పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అధికారులు బుధవారం కంటోన్మెంట్ జోన్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కంటోన్మెంట్ జోన్ లలో ఉన్న షాపులు తెరవకూడదని ,మౌళిక వసతులు కల్పించడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. భీమిలి మార్కెట్ ను పైలాన్ వద్దకు తరిలించామని అన్నారు.కంటోన్మెంట్ జోన్‌లో కొళాయిలు గంట సేపు ఎక్కువగా ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ప్రతీ షాపు లో తెర్మో మీటర్ ,శానిటైజర్ తప్పక వాడాలని లేనిచో వారిపై కేసులు బుక్ చేసి షాపులు సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి కొనుగోలు చేయాలని ఏ ఒక్కరు మాస్కు ధరించక పోయిన వారిని అమ్మకం దారులు కొనుగోలు కు అనుమతించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సి.హెచ్ గోవిందరావు, సి.ఐ జి.శ్రీనివాసరావు, తహశీల్దార్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి బకాయిలు చెల్లింపునకు అనుమతి



విశాఖపట్నం : కోవిడ్-19 మరియు ఇతర కారణాల వలన ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ కాంపా పథకంలో అవుట్సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న బేస్ క్యాంపు వాచెర్స్, ప్రొటెక్స్ వాచెర్స్, చెక్ పోస్ట్ వాచెర్స్, డ్రైవర్స్ మరియు ఇతర గిరిజన సహాయకులకు గత మూడు నెలలుగా జీత భత్యములు చెల్లించలేకపోయామని ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ప్రతీప్ కుమార్, మరియు రాష్ట్ర అటవీ శాఖ మాత్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగింది. సదరు విషయంపై గౌరవ ముఖ్యమంత్రి వర్యులు మానవతా దృక్పథంతో తక్షణమే స్పందించి సదరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖలో పని చేస్తున్న మొత్తం అవుట్సోర్సింగ్ సిబ్బందికి బకాయిలు మొత్తం 921.917 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగినది. ఇకముందు జీత భత్యముల చెల్లింపులలో జాప్యం జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని కూడా తెలియచేయటం జరిగింది. సదరు బకాయిలలో విశాఖపట్నం అటవీ సర్కిల్ సంబంధించిన మూడు జిల్లాలలో అనగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో అవుట్సోర్సింగ్ క్రింద పని చేస్తున్న మొత్తం సిబ్బంది 224 మందికి మూడు నెలల బకాయిలు 89.356 లక్షల రూపాయలు వారి వారి బ్యాంకు సేవింగ్స్ ఖాతాలకు సంబంధిత అవుట్సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 15.07.2020 తేదీ నాడు జమ చేయుటకు చర్యలు తీసుకోవడం జరిగినది.

శ్రీకాకుళం మరియు విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న 30 మంది ఏనుగు సహాయకులకు కూడా వారి జీత భత్యములు 10.706 లక్షల రూపాయలు జూన్ నెల వరకు చెల్లించడం అయినదని మరియు సదరు జిల్లాలలో ఏనుగుల వలన ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తులకు, గాయపడిన వ్యక్తులకు ఆసుపత్రి ఖర్చులకు మరియు పంటలకు నష్ట పరిహారము కొరకు సుమారు 34.92 లక్షల రూపాయలు ఆయా జిల్లా అటవీ శాఖ అధికారుల ద్వారా చెల్లించడమైనది.



# రాంకీ యజమాని అయోధ్యరామిరెడ్డిని అరెస్టు చేయాలి

## ధర్నాలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు డిమాండ్

విశాఖపట్నం : జూలై 13న ఫార్మాసిటీ రాంకీ ఎస్ఈటిపీ సాల్వెంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదానికి కారణమైన రాంకీ యజమాని అయోధ్యరామిరెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని, ప్రమాదంలో మరణించిన కాండ్రేగుల శ్రీనివాస్ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు డిమాండ్ చేసారు.

# సేవా రంగంలో దూసుకుపోతున్న అనకాపల్లి సేన



అనకాపల్లి : కరోనా కష్టకాలంలో కరోనా నివారణకు ఉపయోగించే విలువైన మాస్కులు శానిటైజర్ ల పంపిణీ ద్వారా మరోసారి జై అనకాపల్లి సేన మేమున్నామంటూ సేవారంగంలో నిరుపేదలకు భరోసా కల్పిస్తుంది. జై అనకాపల్లి సేన అధ్యక్షుడు కొణతాల సీతారాం ఆదేశాల మేరకు గత నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాలలో మాస్కులు శానిటైజర్ ల పంపిణీ కార్యక్రమం బుధవారం ము స్థానిక లక్ష్మీదేవి పేట లో నిర్వ హించారు. ఈ సందర్భంగా అనకాపల్లి సేనా కార్యకర్తలు మాట్లాడుతూ కరోనా లేని సమయంలో ఎంతోమంది శానిటైజర్ లు మాస్కులు పంపిణీ చేశారని కానీ నేడు కరుణ మన నటించకు వచ్చేస్తున్న ప్రమాద సమయంలో మాస్కులు శానిటైజర్ ధరలు చుక్కలనంటుతున్న సమయంలో నిరుపేదలకు అది కొనుగోలు చేయడం గుదిబండగా మారింది అన్న ఆలోచనతో వారికి తమ వంతు సహాయం చేయాలని సంకల్పంతో తమ నాయకుడు సీతారాం మాస్కులు శానిటైజర్ పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా లక్ష్మి దేవి పేట లో 500 మాస్కుల, శానిటైజర్ లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి సేన కార్యకర్తలు కొణతాల బాలు, జాన తేజ. కొణతాల అఖిల్ నాయుడు. కే శంకర్ కె రమేష్, పడాల జగన్ .కె నాగేశ్వర్ రావు. బీ నారాయణరావు, బొడ్డేడ మధు. జోడ దిలీప్, కాండ్రేగుల కిరణ్ ,పెద్ద ఎత్తున మహిళలు .సీతారామ్ అభిమానులు పాల్గొన్నారు

# విజయభాను

## సంపాదకీయం

### బలహీన నాయకత్వం

రాజస్థాన్ సంక్షోభం కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వ బలహీనతను మరోసారి బట్టబయలు చేసింది. అసమ్మతి నేత సచిన్ పైలట్ చెప్పుకున్నంత మంది ఎమ్మెల్యేలు ఆయన వెంట లేకపోవచ్చు. కానీ ముఖ్యమంత్రి గెహ్లాట్ పీఠాన్ని కంపింపజే యడంలో సఫలమయ్యారు. 200 మంది సభ్యులున్న రాజస్థాన్ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ పార్టీకి వంద మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉన్నది. కనీసం మరో సభ్యుడి మద్దతు లేకపోతే నిలబడటం సాధ్యం కాదు. ప్రియాంకగాంధీని రంగంలోకి దింపినా సచిన్ పైలట్ దిగిరాలేదు. రాజస్థాన్ సమస్యకు కారణం ఈ రెండు పక్షాల మధ్య కలహంగా కనిపిస్తున్నప్పటికీ, ఇందుకు మూలం ఢిల్లీలోనే ఉన్నదనవచ్చు. కపిల్ సిబల్, శశిథరూర్, సంజయ్ ఝూ తదితర పార్టీ సీనియర్ల అభిప్రాయాలను గమనిస్తే పార్టీ కేంద్ర నాయకత్వ బలహీనతే రాజస్థాన్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో ముఠా కలహాలు హద్దులు మీరడానికి కారణమని స్పష్టమవుతుంది.

మధ్యప్రదేశ్‌లో అసమ్మతి నేత జ్యోతిరాదిత్య సింధియా పార్టీని వీడటంతో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయిన నాలుగు నెలలకే రాజస్థాన్‌లో ముసలం పుట్టింది. మిగతా రాష్ట్రాల్లో పరిస్థితి కూడా ఏమంత చక్కగా లేదు. పంజాబ్‌లో ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతాప్‌సింగ్ సింగ్ బజ్వా, నవ్‌జోత్‌సింగ్ సిద్ధు ఏకతాటిపైకి వచ్చారు. హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు పలు రాష్ట్రాలలో ముఠా కలహాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. కాంగ్రెస్‌లో ముఠా కలహాల సంస్కృతి కొత్తదేమీ కాదు. కానీ అధిష్ఠానవర్గాన్ని లెక్కచేయకుండా ఎవరికి వారే వ్యవహరించడం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది. ఇటీవలి కాలంలో పార్టీని వీడిన ప్రముఖులు పలువురు రాహుల్‌గాంధీకి సన్నిహితులు. ఆయనతో అత్యంత సాన్నిహిత్యం కలిగిన సింధియా, పైలట్ వంటి బలమైన నాయకులు పార్టీని వీడిపోవడానికి కారణమేమిటనేది ఆలోచించవలసిన విషయం.

సచిన్ పైలట్ తిరుగుబాటు తరువాత గెహ్లాట్ ప్రభుత్వం నిలబడగలిగిందా లేదా అనేదే ప్రధానం కాదు. పార్టీ బలాన్ని అంకెలతో కొలువలేము. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ చేతిలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పొంది కార్యకర్తలు నైతిక ట్కస్థైర్యం కోల్పోయినప్పుడు, పైలట్ పార్టీ పగ్గాలు చేపట్టి క్షేత్రస్థాయిలో కృషిచేశాడు. కాంగ్రెస్ గెలుపులో ఆయనది ప్రధాన పాత్ర. దీర్ఘకాలిక దృష్టితో, పార్టీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే, సామాజిక పునాదిగల యువ నాయకులను కాంగ్రెస్ నాయకత్వం కాపాడుకోవాలి. కానీ రాహుల్ గాంధీ క్రియాశూన్యత వల్ల కేంద్ర నాయకత్వమంటూ ఉన్నదా అనే అనుమానం కలుగుతున్నది. వివిధ రాష్ట్రాలలో పార్టీ వర్గాలు చెల్లాచెదురైపోవడంతో పార్టీ ఉనికికే ప్రమాదం వాటిల్లుతున్నది.

కాంగ్రెస్ పార్టీ బలహీనపడితే జాతీయ స్థాయిలో ఆ స్థానాన్ని ప్రాంతీయ శక్తులు కూటమిగా ఏర్పడి భర్తీ చేస్తాయా అనే ఉత్కంఠకు ఈ పరిణామాలు తావిస్తున్నాయి.

## అక్రమ అరెస్టులపై సిఐటియు నిరసన




అచ్యుతాపురం : సిఐటియు నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము అన్నారు. సిఐటియు నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని మండల కేంద్రమైన అచ్యుతాపురంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, రాజాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'జియో'లో గూగుల్ రూ.33,737 కోట్ల పెట్టుబడి




ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్స్‌లో టెక్నాలజీ దిగ్గజం గూగుల్ 33,737 కోట్ల పెట్టుబడి పెట్టనుందని సంస్థ ఛైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. జియో ప్లాట్‌ఫామ్స్‌లో 7.7శాతం వాటాను గూగుల్ కొనుగోలు చేయనుందని ప్రకటించారు. జియో వ్యూహాత్మక భాగస్వామిగా గూగుల్ కొనసాగుతుందని చెప్పారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల 43వ వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎం) బుధవారం జరిగింది. ఏజీఎం నిర్ణయాలను ముకేశ్ ప్రకటించారు. కరోనా నేపథ్యంలో తొలిసారిగా రిలయన్స్ వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది. ఫేస్‌బుక్, ఇంటెల్, క్వాల్‌కామ్ తదితర టెక్నాలజీ కంపెనీలతో పాటు పలు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు, వెంచర్ ఫండ్స్ జియోలో వాటాలు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. రిలయన్స్‌లోకి రూ.2.12 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు వచ్చినట్లు ముకేశ్ వెల్లడించారు. పెట్టుబడుల సమీకరణ లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకున్నామని చెప్పారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అభివృద్ధిలో దూసుకుపోతోందని ముకేశ్ అన్నారు.

దేశంలోనే అత్యధికంగా జీఎస్టీ చెల్లించామన్నారు. వాటాదారులకు ఇచ్చిన హామీ ప్రకారం గడువుకు ముందే రుణ రహిత కంపెనీగా మార్చామని వివరించారు. టెలికాం రంగంలో ప్రపంచంలోనే నెంబర్ 2గా జియో నిలిచిందన్నారు.

## అమెరికాలో ఉడుతకు సోకిన బుబోనిక్ ప్లేగు



హైదరాబాద్: ప్రపంచం అంతా కరోనాతో తికమకపడుతుంటే.. అమెరికాలో తాజాగా ఓ ఉడుతకు బుబోనిక్ ప్లేగు సోకింది. కొలరాడో రాష్ట్రానికి చెందిన ఆ ఉడుత .. బుబోనిక్ పరీక్షలో పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆ రాష్ట్రంలో హెల్త్ వార్నింగ్ జారీ చేశారు. జూలై 11న మోరిసన్ పట్టణంలో జరిగిన పరీక్షలో ఓ ఉడుతకు ప్లేగు సోకినట్లు నిర్ధారణకు వచ్చారు. బుబోనిక్ ప్లేగు.. బ్యాక్టీరియా ద్వారా సోకే వ్యాధి. ఇది ఎలుకలు, ఉడుతల లాంటి జీవాల మీద వాలే ఈగలతో వ్యాప్తి చెందుతుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే, ఈ వ్యాధి మనుషులకు సోకే ప్రమాదం ఉన్నది. ఇటీవల చైనాలో ఇద్దరు అన్నాదమ్ముళ్లకు ఈ వ్యాధి సోకింది. జూలై 7వ తేదీన జరిగిన పరీక్షలో వారు పాజిటివ్‌గా తేలారు. ప్లేగు మళ్లీ పుట్టుకువచ్చిందని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్చరికలు జారీ చేసింది. ప్లేగు సోకిన వారిలో జ్వరం, వణుకుడు, తలనొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వీలైనంత త్వరగా చికిత్స అందించాల్సి ఉంటుంది.

## బీజేపీలో చేరడం లేదు : సచిన్ పైలట్




హైదరాబాద్: రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్.. కాంగ్రెస్ పార్టీ అనర్హత నోటీసులు జారీ చేసింది. పైలట్‌తో పాటు ఆయనతో ఉన్న ఇతర ఎమ్మెల్యేలకు కూడా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరోపణలపై నోటీసులు జారీ చేశారు. అసెంబ్లీ స్పీకర్ మొత్తం 19 మంది రెబల్ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు హాజరు కానందున్న వల్ల అనర్హత వేటు వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చెప్పింది. మరో వైపు బీజేపీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను సచిన్ పైలట్ ఖండించారు. భారతీయ జనతా పార్టీలో చేరడం లేదని పైలట్ స్పష్టం చేశారు. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్‌పై కత్తిదువ్విన పైలట్‌ను డిప్యూటీ సీఎం పదవి నుంచి తప్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ పదవి నుంచి కూడా ఆయన్ను తొలగించారు. గెహ్లాట్‌కు వ్యతిరేకంగా ఇద్దరు మంత్రులు కూడా సచిన్ టీమ్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై పోరాడి గెలిచామని, ఇప్పుడు తానెందుకు బీజేపీలో చేరాలని పైలట్ ప్రశ్నించారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు ఓ తప్పుడు ప్రచారం చేశారని ఆయన అన్నారు.

## ఎయిర్ ఇండియా బోర్డు కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా బోర్డు కీలక నిర్ణయం తీసుకున్నది. వేతనం లేకుండా ఉద్యోగుల దీర్ఘకాల సెలవు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద ఉద్యోగులు ఆరు నెలల నుంచి రెండు ఏండ్లపాటు వేతనం లేని సెలవులు పొందవచ్చు. దీన్ని ఐదేండ్ల వరకు పొడిగించుకోవచ్చు. అప్పుల ఊబిలో కురుకుపోయిన ఎయిర్ ఇండియా ఖర్చులను తగ్గించుకునే దిశగా పలు ప్రయత్నాలు చేస్తున్నది.

ఇందులో భాగంగా ఈ ప్రతిపాదనకు ఆ సంస్థ బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎయిర్ ఇండియాను పూర్తిగా వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించింది. అయితే ఈ సంస్థను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

## కవి సమయం

### శ్రమయే దైవం

పల్లె, పేటలు మనవే...
ఏరు, దుక్కులు వనదే...
ఏమిరో... శ్రమించు నోళ్ళు;
పనులకు పోంద్రో...
కాడెద్దులుతోను
గరువును దున్ని
నాగలి పట్టి
సాలును పూసి
పారిన ఏరుకు గూడ
తారెలు తవ్వి తోవ
మీ చెమటే... జలము
మీ శ్రమయే... ఘనము
శ్రమతో కార్మిక-చలి చలి గున్న
శ్రమతో ధార్మిక-మండే యెండలు వున్న
ఎత్తిన బంగీ-దించిన బంగీ
ఓర్మితో శ్రమలే...
కార్ఖాన పనులే...
నలుదిక్కులులోను
నలుమూలలులోను,
శ్రమ పావనమే - కనిపిస్తుంది
ప్రపంచానికే-శ్రమయే మేలనిపిస్తుంది

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : ఆషాడం; తిథి : ఏకాదశి రా.9.43; కృత్తిక సా.5.54; ఉ.వ.6.33వ

గురువారం 16 -07 -2020

**మేషం** : బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విష యంలో శ్రమాధిక్యత, ప్రయాసలెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి. **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవ హారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి. **మిథునం** :స్త్రీలకు, గృహ వాతా వరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు. **కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథ కాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి. స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరు ద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యా యులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తల పెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు. **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమా వేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. **ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారు లకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం. **మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు. **కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయు లకు పనిభారం అధికమవుతుంది. **మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టు బడులకు అను కూలం. సోదరీ, సోదరుల మధ్య ఏకీభావం కుదరదు.ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు.

## శ్రీరామదూత శిరసా: నమామి:

### సంకీర్తన



అంజనేయస్వామి చరిత్ర చదివిన వారికి బ్రహ్మ చర్య వ్రతపాలన, శీలరక్షణ, బలబుద్ధుల వికాసము శ్రీరామ చంద్రులవారియెడల భక్తి పూర్వకమైన దాస్య భావము మెదలైన మహత్తర గుణోపదేశము లభిస్తాయి. తనని ప్రార్థించిన భక్తులకు వెల్లప్పుడూ సంరక్షిస్తుంటాడు. ఆస్వామి ,భూత, ప్రేత రాక్షసాదులు ఆ స్వామినామాన్ని ఉచ్చరించినంత మాత్రమే పారిపోతాయి.

స్మరణ చేస్తేనే చాలు, అనారోగ్యం కుదుటపడుతుంది. మానసిక దౌర్భగ్య సంఘర్షణలో ఆస్వామి సహకారం లభిస్తుంది. ఆయనవల్ల తులసీదాసుకు రామదర్శనం లభిస్తుంది. ఆయన్ని ధ్యానిస్తే అలౌకికమైన సిద్దులు లభిస్తాయి. ఆ స్వామి బాలబ్రహ్మచారి ఆయన పరాక్రమం ఆమోఘం.

అందుకే శ్రీ రామచంద్రుడు హనుమంతుని యశస్సు గురించి చెబుతూ, "యుద్ధంలో ఆంజనేయుడు చూపించన పరాక్రమాన్ని యముడు ఇంద్రుడు కుబేరుడు ఇతర లోకపాలకులెవరూ చూపలేరు. అన్నాడు.శ్రీ రామచంద్రునికి గెలుపు లభించడంలో హనుమంతుని వంటి నిష్కాను పరాక్రమవంతుడి పాత్ర ఎంతోవుంది. హనుమంతుడు ఒక్కడు జీవించేవుంటే చాలు మనసంతా లేకుంటేనేం శ్రీరాముడికి తప్పక జయం లభిస్తుంది. అని యుద్ధకాండలో అంటాడు. జాంబవంతుడు, ఆయనలో వుండే శ్రీరామభక్తి కారణంగానే ఆంజనేయుని స్మరణ అమోఘమైన ఫలాన్ని సాధిస్తుంది. జీవితంలో సమస్యలెదురై క్లిష్టపరిస్థితిలో వున్నప్పుడు కార్యసాధనకై భక్తులు శ్రీరామసమమేతుడైనా ఆ రామభక్తుని స్మరిస్తే చాలు, భక్తజనవ శంకరుడైన హనుమంతుడు వెంటనే వారి కోరికలు తీరుస్తాడు.శ్రీరామ నామాన్ని ఆంజనేయుడు తన జీవిత సర్వస్వంగా భావించాడు. హనుమంతుడు నలుడు, నీలుడు మెదలైన వానర వీరులకు శ్రీరామనామాన్ని ఉప దేశిస్తూ "త్రాసులోని ఒక పళ్లెంలో సమస్త మహామంత్రాలను అనంత కోటి జ్ఞాన ధ్యానసాధనాఫలాలను ఉంచి, రెండవపళ్లెంలో కేవలం శ్రీ రామనామాన్ని ఉంచితేచాలు అవన్ని కలిసినా సరితూగవు"అంటాడు.

శ్రీరామనామాన్ని జపించేవారిపట్ల ఆంజనేయస్వామి తప్పక ప్రసన్నుడై వుంటాడు. అటువంటి వారిపట్ల వారికి తనుకల్ప వృక్షమై సమస్త కోరికలను తప్పక తీరుస్తాడు.

"సమస్తరోగాములకు ఒకే ఒక దివ్యౌషధం కలదు. అదియే భగవన్నామం"

మనో నియంత్రణ ముఖ్యంఆధ్యాత్మిక అనేది ఎవరో అందిస్తే వచ్చేదికాదు.ఇతరులు ఎవరైనా ఒక మార్గం చూపగలరే గాని ఆ మార్గంలో గమ్యం చేరేందుకు మనబదులు నడవరు. మన అడుగులతో మనం నవాల్సిందే.ఒకరి బదులుద మరొకరు పరీక్ష రాయడం నేరమని విద్యార్థులకు తెలుసు. అదే విధంగా ఒకరికిబదులు మరోకరు ధ్యానం చేసినా ఫలిత ముండదు. ఆధ్యాత్మీక చింతనకు ముఖ్యం కోరికల నుండి మనసును దూరం చేయడం అని పెద్దలు చెబుతారు. నిజమే, పదునుపోయిన కత్తి పండును కోసేందుకు పనికిరానట్టే, అనవసరపు ఆర్షణలకు అల్లుకుపోయిన మనసు మంచి వైపు మళ్ళలేదు.కోరికల భౌతిక సుఖాలు, ఆకర్షణల నుండి మెదుడును,

మనసును దూరం చేసినప్పుడే అది ఆధ్యాత్మిక మార్గాన్ని గ్రహించ గలుగుతుంది. ఆలోచనలకు వేసిన మసకను తొలగించుకోవాలి. అలా తొలగించగలగినదే మననకు తొలగించుకోవాలి.

అలా తొలగించినదే ధ్యానం. ఆ ధ్యానంలో వున్న విశేషాన్ని తెలుసుకుంటే ఇక మిగిలిన ఆడ్డంకులన్నీ వాటంతట అవే తొలగిపోతాయి.



# మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు సౌజన్యంతో క్వారంటైన్ సెంటర్ ఏర్పాటు



కోటఉరట్ల: మండల కేంద్రంలో ఉన్న గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ వద్ద ఏమ్మార్వో రామారావు, ఎస్సై సురేష్ కుమార్ మండల అధికారులతో క్వారంటైన్ సెంటర్ గురించి చర్చించి మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర వైఎస్సార్ సిపి పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షలు డి.వి సూర్యనారాయణరాజు క్వారంటైన్ సెంటర్ ఏర్పాటుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పత్రిక విలేకరులతో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్య నారాయణరాజు మాట్లాడుతూ మండలంలో రోజు రోజుకు కరోనా పాజిటివ్ కేసులు పెరుగు తున్నందున మండల ప్రజలు భయంతో అందో ళన చెందుతున్నారు కావున కరోనా పాజిటివ్ మన మండలంలోకి రాకుండా ఉండాలంటే అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటర్ల్స,గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులకు ఏమ్మార్వో సిబ్బందికి మీ గ్రామాల్లోకి ఇతర రాష్ట్రల నుండి జిల్లాల నుంచి ఇతర ప్రదేశాల నుండి వచ్చిన వ్యక్తులను వెంటనే కోటఉరట్ల జూనియర్ కాలేజ్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్ కు పంపిస్తే ఇక్కడ మూడు పూటలా టిఫిన్, బోజనం, టీ,స్నాక్స్ ఏర్పాటు చేసి వారికి నా సొంత నిధులతో అందిస్తామని తెలిపారు. అలాగే క్వారంటైన్ సెంటర్ కి వచ్చి కరోనా టెస్టులు చేసుకున్న తర్వాత మరలా టెస్టు రిజల్ట్ వచ్చినంత వరకు వారికి అన్ని సదుపాయాలు చూసు కుంటామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్య నారాయణ రాజు పాటు కోటఉరట్ల ఏమ్మార్వో రామారావు, స్థానిక ఎస్సై సురేష్ కుమార్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, కైలాసపట్నం మాజీ సర్పంచ్ సిద్ధబత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం పట్టణం రూరల్ లో 144 సెక్షన్ కఠినంగా అమలు

## - ఆర్డీవో ఎస్.మల్లిబాబు

పెద్దాపురం : పెద్దాపురం పట్టణం మండలంలో కోవిడ్-19 కేసులు వేగంగా పెరుగుతున్నందున అదనపు భద్రత మరియు పాజిటివ్ వ్యాప్తిని నివారించడానికి పెద్దాపురం పట్టణం, రూరల్లో 144 సెక్షన్ ను కఠినంగా అమలు చేస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. ఆదివారం పాత్రికేయులతో మాట్లా డుతూ పెద్దాపురం పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో గుంపులు గుంపులుగా ప్రజలు ఉండకూడదని, అదేవిధంగా మాస్కు ధరించకుండా తిరిగే వ్యక్తులపై అపరాధ రుసుము విధిం చడం జరుగుతుందని తెలిపారు.

ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరుచుకుని అమ్ము కోవచ్చని తెలిపారు. షాపుల వద్ద సామాజిక దూరం పాటించడానికి అవసరమైన ఏర్పాట్లను వ్యాపారస్తులు చేసుకోవాలని, గుంపులు గుంపులుగా ప్రజలు షాపుల వద్ద ఉంటే షాపు యజమానులే బాధ్యత వహిం చాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ, కార్యా లయాలు, బ్యాంకులు, మొదలైనవి పరిమిత సిబ్బందితో,అన్ని భద్రతా చర్యలతో పని చేస్తాయని తెలిపారు.



ప్రజలందరూ అప్ర మత్తంగా ఉండి అవసరం మేరకే బయటకు రావాలే తప్ప మిగతా సమయాల్లో ఇంట్లోనే ఉండాలని తెలిపారు. 144 సెక్షన్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసు శాఖ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు.

# గిరిజన ప్రాంతంలో సిగ్నల్స్ లేక చిన్నారుల బయోమెట్రిక్ ఆన్‌లైన్‌లో అవస్థలు



సిగ్నల్స్ లేక అవస్థలు పడుతున్న ప్రజలు

అనంతగిరి : గిరిజన ప్రాంతంలో సిగ్నల్స్ లేక చిన్నారుల బయోమెట్రిక్ ఆన్‌లైన్‌లో అవస్థలు అనంతగిరి సచివాలయంలో అందిస్తున్న ముఖ్యమైన సేవలు ఇంకా మరెన్నో సేవలు మనగ్రామ సచివాలయంలో అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించే ప్రక్రియలో మన్యంలో చాలా పంచాయతీలో ప్రజలు సిగ్నల్స్ లేక అవస్థలు పడుతున్నారు. అయితే ఇప్పుడు అన్ని ప్రభుత్వ పథకాలు ఆన్ లైన్ అవ్వడంతో ఎంతో కష్టంగా ఉంది.గిరిజన ప్రాంతంలో మండలానికి 1,2 మీసేవ కేంద్రాలు ఉన్నప్పటికీ సరిపోవటం లేదు దిగువ మైదాన ప్రాంతానికి చెందిన ఎల్, కోట గ్రామంలో మీ సేవ కేంద్రంలో గిరిజన ప్రాంత వాసులు తల్లిదండ్రులు తమ పిల్లల్ని తీసుకుని అక్కడికి వెళ్లి ఆన్లైన్ చేయించుకోవాల్సి వస్తుంది ఈ సమయంలో కరోనావ్యాధి పరిస్థితుల వల్ల వారం రోజుల తర్వాత రండి పది రోజులు తర్వాత రండి అని చెప్పడం రెండు మూడు సార్లు తిరగవలసి వస్తుంది అయినా ప్రజలు తిరుగు తున్నారు, ప్రభు త్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుం టున్నారు.

# కోనాం జలాశయంలో పడవ బోల్తా : ఒకరి గల్లంతు



- కట్టె పుల్లల కై వెళ్లి కడ తీరిపోయిన గిరిజనుడు
- రోడ్డున పడిన గిరిజన కుటుంబం

చీడికాడ/దేవరాపల్లి : మండలంలోని కోనాం జలాశయంలో పడవ బోల్తా పడి గిరిజనుడు గల్లంతయ్యాడు.ఈ సంఘటనకు సంబంధించి బాధితులు,గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోనాం గ్రామానికి చెందిన శిరగం కళ్యాణం, నడుపూరు ఈశ్వరరావు, తోటాడ కళ్యాణం, ముగ్గురు కలిసి మంగళవారం కట్టెపుల్లలకోసం జలాశయం ఆవలి వైపున గల కొండకు వెళ్లి కట్టెపుల్లలు సేకరించారు. సాయంత్రం మూడు గంటల సమయంలో తిరుగు ప్రయాణం అయినా శిరగం కళ్యాణం ఒక పడవ పై బయలుదేరగా నడుపూరి ఈశ్వరరావు, తోటాడ కళ్యాణం మరో పడవపై బయలుదేరారు, అయితే ఇరువురు ఉన్న పడవ ముందు వస్తుండగా వెనుకనే కళ్యాణం పడవ పై వస్తున్నాడు సారి గెడ్డ, గుల్లి గెడ్డ, కలిసే సంగమం వద్ద కు వచ్చే సరికి పడవ కనిపించింది కానీ కళ్యాణం కనిపించలేదని ముందు పడవపై ఉన్న వారు తెలుపడంతో కుటుంబీకులు, బంధువులు, చుట్టు పక్కల గ్రామాల వెతికిన ఫలితం కనిపించకపోవడంతో బుధవారం ఉదయం గ్రామస్థుల సహకారంతో జలాశయంలో వెతకడం ప్రారంభించారు. అయితే కళ్యాణానికి ఒక కుమార్తె ఇరువురు కుమారులు ఉండగా కుమార్తె కు వివాహం చేశాడు. కూలీనాలీ చేసి కుటుంబాన్ని పోషించే కళ్యాణం కట్టె పుల్లలకు వెళ్లి కనుమరుగై పోవడంతో కుటుంబీకుల రోదన వర్ణనాతీతం. అయితే ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న స్థానిక ఎస్సై సురేష్ కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ ఎస్వి అంబేద్కర్ సంఘటనా స్థలంనికి చేరి సంఘటన పై పూర్వాపరాలు తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రం వరకు మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు.

# 1250 లీటర్ల సారా పులుపును పట్టుకున్న కోటఉరట్ల ఎస్సై సురేష్ కుమార్

కోటఉరట్ల : మండలంలో ఆక్సాయిబ్ పేట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఎస్సై సురేష్ కుమార్ మరియు పోలీసు సిబ్బందితో కలిసి 1250 లీటర్ల సారా పులుపును పట్టుకున్నారు. ఎస్సై సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆక్సాయిబ్ పేట గ్రామంలో నాటుసారా తాగితే అనా రోగ్యానికి గురవుతారని ఎన్నిసార్లు అవగాహన కార్యక్రమాలు పెట్టినా ఆక్సాయిబ్ పేట గ్రామంలో మార్పు రావటం లేదని తెలిపారు. ఎవ రైనా నాటుసారా తయారు చేసినా అమ్మినా వారు పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలి పారు. ఎస్సై సురేష్కుమార్ తో పాటు పోలీసు సిబ్బంది నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



# హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడా



విశాఖపట్నం : గుల్ల పాలెంలో హెచ్పిసిఎల్ ఆధ్వ ర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ నిర్వ హించడం జరిగింది. ఈ కార్య క్రమంలో భాగంగా గుల్లల పాలెం, కుంచమ్మ కాలనీ, రాజకవీధిలలో ఉన్న ఎనిమిది వందల కుటుంబాలకు హెచ్పిసిఎల్ ద్వారా రెండు సబ్బులు రెండు మాస్కులు పంపిణీ జరిగింది. ఈ కార్య క్రమంలో హెచ్. పి.సి.ఎల్ ఛీఫ్ మేనేజర్ వి.ప్రభాకర్, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ ఎంకెవిఎల్ కాళీ,డాక్టర్ సోనావని పాల్గొ న్నారు. స్థానిక ఐద్వా నాయ కులు బి.మమత ధాన్ ఫౌండే షన్ నుంచి రీజినల్ కోఆర్డి నేటర్ కె.రమాప్రభ ,మల్కాపురం కలాంజియ సమాఖ్య ఇన్చార్జి కె.మురళీ కృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలకు డాక్టర్ సోనావని కోవిడ్ కి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం,ఎప్పటికప్పుడు చేతుల్ని శుభ్రం చేసుకోవడం, బయటికి వెళితే మాస్కులు ధరించడం ద్వారా కాపాడుకోవచ్చు అని చెప్పారు. సీనియర్ మేనేజర్ కాళీ మాట్లాడుతూ ప్రతి సంవ త్సరం స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాన్ని హెచ్పిసిఎల్ నిర్వహిస్తుంది అందులో భాగంగా ఈ కార్యక్రమం చేసాయడం జరిగింది అన్నారు. కోవిద్ కారణంగా బహిరంగంగా ఎక్కువమందిని కలవలేని పరిస్థితుల్లో డిజిటల్ మీడియా ద్వారా ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా కోవిద్ నిర్మూలనకి, స్వచ్ఛభారత్ ప్రచారం చేస్తున్నామని చెప్పారు. చీఫ్ మేనేజర్ ప్రభాకర్ ప్లాస్టిక్ ని ఉపయోగించకుండా, తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని సూచించారు. మహిళలు చైతన్యవ%శీ%తమైతే సమస్యలు పరి ష్కారం అవుతాయి, కరోనా నియంత్రణ మహిళల ద్వారా సాధ్యమవుతుందని తెలియజేశారు.

ఐద్వా నాయకులు మమత మాట్లాడుతూ హెచ్పిసిఎల్ లో మేము నివాసం ఉంటున్నాము, ఇక్కడ ప్రజలందరూ కూడా హెచ్పిసిఎల్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు పిల్లల,మహిళల కోసం చేయాలనీ ఆమె అధికారులను కోరారు,కోవిడ్ సమయంలో మాస్కులు సబ్బులు ఉపయోగం అందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఎం.నిర్మల, కే.కృష్ణవేణి, డి.వారలక్ష్మి, బి.విజయ పాల్గొన్నారు.

## కరోనా విపత్కర పరిస్థితుల్లో

# వీధిబాలలు, అనాథలను గుర్తించి వారికి సంరక్షణ కల్పించాలి



పెద్దాపురం : కరోనా విపత్కర పరిస్థితుల్లో వీధిబాలలు, అనాథలను గుర్తించి వారికి సంరక్షణ కల్పించాలనే సదుద్దేశంతో ముస్కాన్ కోవిడ్-19 వాహనాన్ని ప్రారంభించడం జరిగిందని పెద్దాపురం డిఎస్పీ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి వారి కార్యాలయంలో డిఎస్పీ పాత్రికేయులతో మాట్లాడుతూ అపరేషన్ ముస్కాన్ కోవిడ్-19 వాహనం ద్వారా ఎటువంటి ఆధారం లేని వీధిబాలలు, అనాథ లను గుర్తించి వారికి సంరక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు,కార్మికశాఖ,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సమన్వ యంతో ఈ ఆపరేషన్ ముస్కాన్ కోవిడ్19 వాహనం డివిజన్ లో రోజుకొక సర్కిల్ లో తిరుగు తుందని తెలిపారు. ఈ వాహనం ద్వారా గుర్తించిన పిల్లలకు కోవిడ్ పరీక్ష నిర్వహించిన అనంతరం రెస్క్యూ హౌస్ కు పంపించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఎవరైనా బాల కార్మికులను గుర్తించి మాకు సమాచారం అందిస్తే వెంటనే వారికి సంరక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ప్రతీ ఒక్కరూ అవసరమైతే తప్ప ఇంట్లోనే వుంటూ కరోనా వైరస్ బారి నుండి తమను తాము రక్షించుకోవాలని డిఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జయకుమార్, లేబర్ ఇన్స్పెక్టర్ కె.రఘుపతి, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్ ఫార్మా.. క్షణం క్షణం... భయం భయం

## బ్రతుకు బండికోసం ప్రాణాలు గుప్పిట్లో

పరవాడ : పరవాడలో ఉన్నజవహర్ లాల్ నెహ్రు ఫార్మాసిటీలో పనిచేస్తున్న వారు క్షణం క్షణం భయం భయంగా బ్రతుకుతున్నారు. కంపెనీలుకు కూతవేటదూరంలో ఉన్న తాణాం, తాడి, పరవాడ ప్రజలు ఎప్పుడు ఏప్రమాదంసంబవిస్తుందో ప్రాణాలు గుప్పిట్లో పెట్టికోని బ్రతుకుతున్నారు. సాయినార్ లైఫ్ సైన్స్ ప్రవేట్ కంపెనీలోప్రమాదం జరిగి వారం కూడాగడవక ముందే అప్పుడే రాంఖీ విశాఖ సాలెవెంట్ లో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారు. సుమారు ఎనభై కంపెనీలు ఉన్న ఈపార్మాసిటీలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించిఉంటే ఈప్రమాదాలు జరగకపోవచ్చు అని స్దానిక ప్రజలు అంటున్నారు. ఈమయదారి పార్మకంపెనీలు వల్ల స్దానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఎప్పుడు ఎటునుండి ఏప్రమాదం సంభవిస్తుందో అని కంటిమీద కునుకులేక పరవాడ, తాణాం, తాడి ప్రజలు జీవిస్తున్నారనీ అని స్దానికులు తెలిపారు. ఇప్పటికైనా అదికార్లు స్పందించిభద్రతా ప్రమా ణాలు పాటించనీ ఈకంపెనీలు పై చర్యలు తీసుకోవాలనీ పలువురు కోరుతున్నారు.



# వినాయక నిమజ్జనోత్సవ కమిటీ కార్యదర్శిగా జానీ



అనకాపల్లి : అనకాపల్లి వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ నూతన గౌరవ కార్యదర్శిగా మందపాటి జానకిరామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్దానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్‌లో నిమజ్జనోత్సవ కమిటీ సమావేశం జరిగింది. వ్యవస్దాపకులు ఆడారి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అద్యక్షులుగా శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాధ్, గౌరవ కార్యదర్శి పట్టణ అద్యక్షులు మందపాటి జానకిరామరాజు మళ్లసురేంద్ర, వైస్ చైర్మన్లగా కాండ్రేగుల శ్రీరామ్, బొద్దపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా కెఎం నాయుడు, కొడుకుల శ్రీకాంత్, ఇన్‌ఛార్జ్‌లుగా రమణబాబు, సంతోష్, అల్లు త్రినాధ్, నియమితు లయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొమ్మోజు రమేష్, బొడ్డేడ ఈశ్వర్, బి. సోమశేఖర్, తాకాశి సతీష్, మరో పది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఈ సందర్బంగా కుమారస్వామి కాండ్రెగుల శ్రీరామ్, బొద్దపు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబందనల మేరకు వినాయక నవరాత్రి ఉత్సవాలు నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు, కరోనా వైరస్ వలన ఇబ్బంది కలగకుండా పూజలు నిర్వహించాలని, అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీపీఎం నేత పేరయ్య అనారోగ్యంతో మృతి



దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయతీ శివారు ఇప్పగరువు గ్రామానికి చేందిన సిపిఎం పార్టీ సీనియర్ నేత గిరిజన సంఘం నాయుడు బి. పేరయ్య బుధవారం అనారోగ్యం మరణించారు. ఈయన మరణం పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న, మండల కార్యదర్శి సిహెచ్ రాజు అన్నారు. పేరయ్య గత 15 సంవత్సరాలు నుండి వాలాబు పంచాయతీలోను మండలంలోని గిరిజన సంఘం నాయకునిగా అనేక సేవలు చేయడంతో పాటు పార్టీ ప్రజా సంఘాలు నిర్మాణానికి ఎనలేని కృషి చేసారని తెలిపారు. పార్టీ మండల కమిటీ సభ్యునిగా 15 సంవత్స రాల నుండి శాఖ కార్యదర్శిగా మూడుసార్లు పంచాయతీ వార్డు మెంబరుగా వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. బుధవారం స్వగ్రామం అయిన ఇప్ప గరువులో అంత్యక్రియలు జరిపారు. పలు ప్రజా సంఘాలు నాయకులు పార్టి నాయకులు పేరయ్య కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు.

వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపిన వారిలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి ముత్యాలు నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఇ.నాయుడుబాబు, పోడెల నాని, మాజీ సర్పంచ్ పోడెల జగన్నాధం, పోడెల సత్యనారాయణ (బుజ్జి) సంతాపాన్ని ప్రకటించారు.

# చోడవరంలో భారీగా గంజాయి పట్టివేత



పోలీస్ తనిఖీలలో పట్టుబడ్డ గంజాయి

చోడవరం : మండలంలోని రెండు వేరు వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు భారీగా గంజాయ్ పట్టుబడినట్లు సీఐ కరణం ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని గౌరీ పట్నం జంక్షన్ సమీపంలో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా పాడేరు నుంచి ఐచర్ వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 168 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. పాడేరు మండలం కిండంగి గ్రామానికి చెందిన బొర్రా చంద్రరావు, పి గొందూరు గుండా కళ్యాణం గంజాయి తరలిస్తున్నారు. పోలీసులను గమనించిన కళ్యాణం పరారి కాగా చంద్రరావు పట్టు బడడంతో అతనిని అరెస్టు చేసి స్టేషన్కు తరలించా మన్నారు. అలాగే వెంకన్నపాలెం జంక్షన్ సమీపంలో పోలీస్ తనిఖీ లలో హైదరాబాద్ జీడి మెట్ల ప్రాంతానికి చెందిన పి. తు నాయక్ బొలెరో వాహనంలో 118 కిలోల గంజాయి తరలి స్తుండగా పట్టుబడ్డాడు.

గంజాయి తరలిస్తున్న వాహనం తో పాటు తు నాయక్ ను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా గుణం ఎంతో గొప్పది

## ప్రశాంతి విద్యాసంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్



అచ్యుతాపురం : సేవా గుణం ఎంతో గొప్పదని అది ఎంతో మంది నిరుపేదలకు చేయూత నిస్తుందని ప్రశాంతి విద్యాసంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్ అన్నారు . బుధవారం మండల కేంద్రమైన అచ్యుతాపురం గ్రామానికి చెందిన కూండ్రపు నాయుడుబాబు పుట్టిన రోజు సందర్భంగా పూడిమడక శివారు కడపాలెం గ్రామంలో దివ్యాంగులకు , వృద్దులకు శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమకు ఉన్నంతలో సాటివారికి సహాయం చేయాలనే ఆలోచనతో దివ్యాంగులకు, వృద్దులకు నాయుడుబాబు దుప్పట్లు అందిం చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు, యజ్జల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్వారంటైన్ టీమ్ సేవలు వినియోగించుకోండి : శివరాజ్ మీనా



యానాం : హెూమ్ క్వారంటైన్, గెస్ట్ హౌస్ ,హాస్టల్స్ తదితర వాటిల్లో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వ్యక్తులు ఎవరైనను ఈ క్వారంటైన్ ప్రాంతాలలో అధికారులు నియమించిన ప్రభుత్వ సిబ్బంది క్వారంటైన్ టీం సేవలు వినియోగించుకోవాలని ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా తెలిపారు .బుధవారం ఆయన కార్యాలయంలో లో విలేకరులతో మాట్లాడుతూ బుధవారం మరో ఏడు పాజిటివ్ కేసులు పిల్ల రా య వీదిలో 2 ,బెజవాడ వీధిలో 2 ,కురసం పేట 1 ,ప్రాన్స్ తిప్ప 1,కనకాల పేట 1చొప్పున ఏడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి మొత్తం వీటితో యానాం ప్రాంతంలో 55 కు చేరినట్లు తెలిపారు .ఈ పాజిటివ్ కేసులు అన్నియు ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన వారి కనెక్టింగ్ కేసులని తెలిపారు .ముఖ్యంగా క్వారంటైన్ లో ఉన్న వ్యక్తులందరూ ఆయా ప్రాంతాల క్వారంటైన్ ప్రభుత్వ సిబ్బంది టీము ను వినియోగించుకొని వైరస్ కు దూరంగా ఉండాలన్నారు .చెక్ పోస్టులు దగ్గర నిఘా పెంచి వైరస్ నివారణకు చర్యలు చేపట్టాలని చెక్ పోస్ట్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వ్యాపార సమయ వేళలు గురువారం నుండి ఉదయం 6 నుండి 11 గంటల వరకు మార్పు చేసినట్లు తెలిపారు .11 తరువాత ఎవరు బయటికి రాకూడదని అన్నారు .ప్రభుత్వ అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని, నియోజకవర్గ ప్రజలందరూ మాస్కులు, భౌతిక దూరం, చేతులు కడుక్కోవడం వంటి జాగ్రత్తలు తీసుకుని అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకూడదన్నారు. వైరస్ సోకిన వారి కొరకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఆదిరెడ్డిపాలెంలో

# ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్

**గ్రామీణ ప్రాంతాన్ని కూడా వదలని కరోనా మహమ్మారి**

సబ్బవరం : మండలంలో కరోనా కేసులు ఎక్కువయ్యాయి. ఇటీవల కాలంలో ఐదు గ్రామాల్లో ఐదు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. సబ్బవరం మేజర్ పంచాయితీలో భాగమైన ఆదిరెడ్డిపాలెం గ్రామంలోని ఒక వ్యక్తికి, కరోనా పాజిటివ్ కేసు నమోదు అయిందని పిహెచ్సి వైద్యులు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాన్ని కూడా వదలని కరోనా మహమ్మారి వలన గ్రామీణవాసులు భయాందోళనకు గురి అవుతున్నారు. కరోనా వచ్చిన వ్యక్తి విశాఖపట్నంలో ఓమ్ని ఆర్కే హాస్పిటల్నందు డాక్టర్గా పనిచేస్తున్నారు. ఇతను విశాఖపట్నంలో నివసిస్తున్నారు. ఇతనికి కొద్దిరోజులు నుండి జ్వరం రావడంతో కోవిడ్-19 వైద్య పరీక్షలు చేయించుకోగా కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయిందని వైద్యులు తెలిపారు. తనుపనిచేస్తున్న హాస్పిటల్లో చికిత్స చేయించుకొనుచున్నారు. దీంతో సబ్బవరం మండలంలో 6 కరోనా కేసులు నమోదు కావడంతో మండలంలోని గ్రామీణ ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు.

## పదో తరగతి ఉత్తీర్ణత జిఓ అభినందనీయం

### చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం.

విశాఖపట్నం : పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించిన దాదాపు 6.3 లక్షల మంది విద్యా ర్థులకు జి.ఓ. నెంబర్.34 ని విడుదల చేసి "అందరు పాస్"ప్రాతిపదికన అందరికీ సమ న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ధైర్య, సాహసోపేత నిర్ణయం తీసుకుందని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొం డు సీతారాం హర్షం వ్యక్తం చేశారు, బుధవారం విడుదల చేసిన ప్రకటన లో ఆయన మాట్లాడుతూ ఈ జి.ఓ.విడుదల కాక మునుపు ఇటు విద్యార్థులు,తల్లి దండ్రుల లో, గ్రేడులు ఎలా నిర్ధారిస్తారు? హాజరు పరిగణన లోనికి తీసుకుంటారా? తొమ్మిదో తరగతి సంవత్సర ఫైనల్ పరీక్షల్లో లోని అంతర్గత మార్కులను కొలమానంగా తీసుకుంటారా? 3 ఎఫ్.ఏలు గాని,ఎస్.ఏ,1 మార్కులను గణించి, ఫలితాలు వెల్లడి చేస్తారా అన్నటు వంటి ఎన్నో మానసిక సంఘర్షణల తో కొట్టుమిట్టాడుతున్నా రన్నారు,వీటన్నిటినీ పటాపంచలు చేస్తూ బాలల బంగారు భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర పటాపంచలు చేస్తూ బాలల బంగారు భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, విద్యా శాఖామంత్రి ఆది మూలపు సురేష్ లు చక్కని ఉత్తర్వులు జారీచేయడం, అభినందనీయమన్నారు. ఇదే క్రమంలో ఇంటర్మీడియట్ ప్రవేశాలు. ట్రిపుల్ ఐటీల ప్రవేశాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు ను ప్రణాళికతో వేగవంతం చెయ్యాలని కోరారు. అందరికీ ఆమోదయోగ్యమైన ఉత్తర్వులు జారీచేసిన ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రులతో పాటు ఉన్నతాధికారులకు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సీతారాం అన్నారు.

# సీఎం జగన్‌కు పాలాభిషేకం



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో వైయస్సార్ క్రాంతి పదం విఒఎలు రూ.8వేల వేతనం ఇచ్చినందుకు గాను బుధవారం ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుర్ల గిరిబాబు, గుండుపాల రామకృష్ణ, రావణాపల్లి సత్తిబాబు, కొమిర రాజుబాబు, అప్పలనాయుడు, పిజిపేట నుండి పత్తి రమణ, పాకలపాడు నుండి బెన్నయ్య నాయుడు, వైజిపేట నుండి అప్పలనాయుడు, విఒఎలు పాల్గొన్నారు.

## సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం 18 రోజులకు రూ.7.97 లక్షలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు.గడచిన 18 రోజులకు గాను సత్యదేవుని హుండీల ఆదాయం మొదటి రోజు లెక్కింపులో భాగంగా రూ.7,97,037/-(ఏడు లక్షల, తొంభై ఏడు వేల,ముప్పై మూడు రూపాయలు) లభ్యమయ్యాయి.ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాధరావు,డిప్యూటీ ఈవో ఈరంకి.జగన్నాధరావు, ఏసి రమేష్ బాబు,ఏఈవో ప్రసాద్ మరియు దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా వైరస్ యానాం ప్రత్యేక అధికారి రవి ప్రకాష్

యానాం :నియోజకవర్గంలో రోజు రోజుకి పెరుగుతున్న కరోనా వైరస్ పాజిటివ్ కేసుల నేపథ్యంలో అధికారుల సే నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారి గా ఆకెళ్ళ రవిప్రకాష్ ఐఏఎస్ ను పుదుచ్చేరి ప్రభుత్వం నియమించింది. ఈయన పుదుచ్చేరి నుండి రోడ్డు మార్గాన బుధవారం బయల్దేరి యానాం రానున్నారు. ఈయన యానాంలో పరిపాలన అధికారి గా సేవలందించిన అనుభవం ఉండి ఐఏఎస్ అధికారి హెూదాలో మొదటిసారి యానాం రానున్నారు .ఈయన తెలుగు ఐఏఎస్ అధికారి కావడంతో నియోజకవర్గంలో వైరస్ నివారణ కొరకు పలు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు.

# మేము సైతం...



విశాఖపట్నం : మేము సైతం 'మానవసేవే మాధవ సేవ, 'ప్రార్ధన చేసే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న' అనే మాటలను నిజం చేసిన జీవీఎంసీ వార్డ్ సెక్రటరీలు, వాలంటీర్స్ మేము సైతం నీకు అండగా నిల బడతాం అని వాలంటీర్ అరుణ కుటుంబం కు ఆర్థిక ఇబ్బంది వుంది అని తెలుసుకొని తమ భాద్యతగా హాస్పిటల్ ఖర్చులు, తదితర అవసరాల కోసం రూ.40000 వారి కుటుంబానికి ఇవ్వటం జరిగింది. అరుణ కుటుంబం వార్డ్ అడ్మిన్స్ పీజే గణేష్‌కుమార్, భార్గవ్, పవన్, వార్డ్ సెక్రటరీ పీవీ కిరణ్ కుమార్, జాన్, శ్యామలరావు, దీప్తి, వాలంటీర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపి అభ్యర్ధి పై హత్యా ప్రయత్నానికి పాల్పడిన వారిని

# వెంటనే అరెస్ట్ చేయాలి

భీమునిపట్నం: విజయనగరం లో భాజపా వార్డు కార్పొరేటర్ అభ్యర్థి నారాయణరావు పై హత్యా ప్రయత్నానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నగర బాజాపా కార్యదర్శి వాసుపల్లి శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

విజయనగరం పట్టణంలోని వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థిగా భార తీయ జనతా పార్టీ నుండి పోటీ చేసినటువంటి నారాయణ రావు అనే యువకుడును వైఎస్ఆర్ సీపీ నాయకులు ఇంటి వద్దకు వెళ్లి హత్యా ప్రయత్నం చేసారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన హత్య రాజకీయాలు భారతీయ జనతా పార్టీ ముందు ఎక్కువ రోజులు కొనసాగవని ఈ కుట్రకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగి ప్రభుత్వాన్ని ఎండగడతామని ఆయన హెచ్చరించారు.

## గిరిజన రైతులకు ఆర్ఓఎస్సార్ పట్టాలు మంజూరు చేయాలి

### ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసిపెంట అప్పలనరసయ్య




అనంతగిరి : అనంతగిరి మండలం పరిధిలో గల కొత్తూరు పంచాయతీ తోటవలస గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసిపెంట. అప్పలనర్సయ్య పర్యటించి గిరిజన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న 13 గిరిజన కుటుంబాలకు ఫారెస్టు పోడు భూములకు పట్టాలు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు 3 ధపాలుగా సర్వేలు నిర్వహించిన మాకు పట్టాలు మంజూరు చేయలేదు. ఇప్పుడు మరలా సర్వే చేసి ఉన్నారు ఇప్పటికి అయినా ఇస్తారా లేదా అని ప్రజలు చెప్పడం జరిగింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేమెంట్లు ఇచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

కరోనా కష్ట కాలంలో ఎన్ఆర్ఇజిఎస్ పేమెంట్లు వారానికి వారం చెల్లించాలని ఆర్.ఓ.యఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె, మొస్య. డి. గంగరాజు. జి. దేవన్న. కె. స్వామి గ్రామస్తులు హరి. అజీత్. భీమన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీఆర్పీపై చర్యలు తీసుకోవాలంటూ ఏపిడిని నిలదీత



ఏపిడిని నిలదీస్తున్న రత్నంపేట గ్రామస్థులు

కొయ్యూరు : వీఆర్పీ అవకతవకలకు పాల్పడ్డారని, వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన చేస్తామని రత్నంపేట పంచాయతీ ప్రజలు బుధవారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద ఏపిడిని నిలదీశారు. గత మూడు నెలలుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉపాధి హామీ మీ పథకం వీఆర్పీ చేతివాటం ప్రదర్శిస్తున్నాడని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పూర్తి ఆధారాలతో సహా అధికారులకు చూపిస్తే అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారన్నారు. గతంలో గ్రామానికి సోషల్ ఆడిట్ నిర్వహించారని, ఆ సోషల్ ఆడిట్‌లో ఈ అవకతవకలు ఎందుకు గుర్తించలేదని, అదే గ్రామానికి చెందిన విద్యార్థులు ఏపిడిని నిలదీశారు. అధికారులు ఇప్పటికైనా విచారించి చర్యలు చేపట్టకపోతే, మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపడతామని సిపిఎం నాయకులు సూరిబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రత్నంపేట యువత విజయ్, జ్యోతితో పాటు ఆ గ్రామానికి చెందిన సుమారు 20 మంది యువకులు పాల్గొన్నారు.

## కొయ్యూరులో మరో ఏపిఎస్పీ కానిస్టేబుల్‌కు కరోనా పాజిటివ్



పాజిటివ్ వచ్చిన ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ను అంబులెన్స్‌లో పంపిస్తున్న ఎస్సై దాసరి నాగేంద్ర

కొయ్యూరు : కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో మరో ఏపిఎస్పీ కానిస్టేబుల్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఈ నెల 10న విజయనగరంలో కరోనా విధులు ముగించుకొని అక్కడే కరోనా పరీక్షలు చేయించుకొని కొయ్యూరు వచ్చిన తర్వాత హోం ఐసోలేషన్‌లోనే ఉన్నారు. అయితే బుధవారం పాజిటివ్ నిర్ధారణ కావడంతో కొయ్యూరు ఎస్సై దాసరి నాగేంద్ర నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించడం జరిగిందని తహశీల్దార్ శ్రీధర్, ఎస్సై దాసరి నాగేంద్ర తెలిపారు.

# ఇగ్నోలో రాష్ట్ర స్థాయి అధ్యయన కేంద్ర సమన్వయకర్తల సమావేశం



విశాఖపట్నం : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 2020 సంవత్సరానికి గాను విశాఖపట్నం విజయవాడ ప్రాంతీయకేంద్రాల పరిధిలోని అన్ని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమావేశం ఈరోజు అంతర్జాల వేదికగా నిర్వహించింది. కరోనా వైరస్ రాష్ట్రమంతటా ప్రబలుతున్న ఈ సమయంలో గూగుల్ మీటింగ్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇగ్నో కేంద్ర కార్యాలయం, ప్రాంతీయ సేవల విభాగం సంచాలకులు డా. ఎమ్. షణ్ముగం అధ్యక్షత వహించి కీలకోపన్యాసం చేసారు. సమావేశాన్ని ప్రారంభించిన విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. ఎస్?. రాజారావు మాట్లాడుతూ దూరవిద్యా విధానంలో అధ్యయన కేంద్రాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని, విద్యార్థులకి, విశ్వవిద్యాలయానికి మధ్య ఈ అధ్యయన కేంద్రాలే అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని కోరారు. ముఖ్య అతిథి డా. ఎమ్. షణ్ముగం కీలకోపన్యాసం చేస్తూ మార్చి నెలలో మొదలై ఇంకా విస్తృతంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో వ్యాపిస్తోన్న కరోనా మహమ్మారి కాలంలో కూడా ఇగ్నో విద్యార్థులకు ఆన్‌లైన్ మాధ్యమాలద్వారా నిరాటంకమైన సేవలు ఎలాఅందించాలనే అంశాన్ని విశదీకరించిన ఆయన ఈ క్రమంలో ప్రాంతీయ కేంద్రాలతో పాటూ అధ్యయన కేంద్రాలు కూడా ముఖ్య భూమిక వహించాలని కోరారు. కరోనా కారణంగా జీవితంలోని అనేక అంశాలు స్తబ్ధుగా ఉండిపోయినా గానీ విద్యారంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థుల విద్యా వ్యాసంగానికి భంగం కలుగకుండా చూడాల్సిన భాధ్యత అన్ని విద్యా సంస్థలకు ఉందని, ఇగ్నో ఈ విషయంలో ఎన్నో కొత్త సాంకేతిక మార్గాలకు దారులు తెరిచి లక్షలాది విద్యార్థులకు సేవలు అందిస్తూనే ఉందని అన్నారు. ఇగ్నో వార్షికపరీక్షల విషయంలో కూడా త్వరలోనే నిర్ణయాన్ని వెలువరుస్తామని, మిగిలిన అన్ని సేవలు ఆన్ లైన్ మాధ్యమాలద్వారా నిరాటంకంగా నడుస్తాయని అన్నారు. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఇగ్నో న్యూఢిల్లీ ప్రాంతీయ సేవల విభాగం ఉప సంచాలకులు డా. కె. డి. ప్రసాదు మాట్లాడుతూ ఇగ్నో కోర్సుల్ని అన్ని వర్గాలవారికి మరింత చేరువ చేసేలా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ లోని విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇక్కడి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అవసరమైన కొత్తకోర్సుల్ని అందించాలని, ఆ మేరకు ప్రాంతీయ కేంద్రాలతో పాటు అధ్యయన కేంద్రాలు కూడా చొరవ తీసుకుని వివిధ ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఇగ్నో కోర్సుల్ని మరింత ఎక్కువమందికి అందుబాటులోకి తేవాలని ఆకాంక్షించారు. విశాఖపట్నంఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయం విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ప్రాంతీయ కేంద్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ పట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. ఎస్. రాజారావు,విజయవాడ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డా. కె. సుమలత తాము చేపట్టిన వివిధ కార్యక్రమాల్ని సభకు నివేదించారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సహాయ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు, విజయవాడ ప్రాంతీయ కేంద్ర సహాయ సంచాలకులు డా. బి. ప్రసాద్ బాబు ప్రస్తుతం నడుస్తున్న అడ్మిషన్లు, కొత్తగా ప్రారంభమయిన వివిధ కోర్సుల వివరాలు, విద్యార్థులకు అందించాల్సిన సహాయ, సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లోని పదమూడు జిల్లాలనుండి సుమారు అరవైమంది ఇగ్నో అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు, ప్రతినిధులతో పాటు రెండు ప్రాంతీయ కేంద్రాల ఇగ్నో సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పర్వత చొరవతో
## విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణంనకు శంఖుస్థాపన



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం లో విశ్రాంతి ఉద్యోగులు చాలా కాలం నాటి నుండి ఎదురుచూస్తున్న కల ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ చొరవతో నెరవేరిందని అంటున్నారు.ముఖ్యంగా ఎమ్మెల్యే పర్వత సహాయ సహకారములతో విశ్రాంతి ఉద్యోగులకు స్దలం కేటాయించి దానిలో భవన నిర్మాణమునకు ఐదు లక్షల రూపాయలు కేటాయించడంపై స్దానిక విశ్రాంతి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

అయితే మంగళవారం స్దానిక వైసీపి నాయకులు, పంచాయతీ ఈవో, విశ్రాంతి ఉద్యోగులు కలసి విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణమునకు శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగులు వైస్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ ఘణా పాఠి, నామాల నరసింహమూర్తి, బర్ల.నూకరాజు, ఈరంకి సుబ్రహ్మణ్యం తదితరులు స్దానిక ఎమ్మెల్యే పర్వత.పూర్ణ చంద్ర ప్రసాద్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్దానిక వైసీపీ నాయకులు టౌన్ ప్రెసిడెంట్ రాయవరపు భాస్కరరావు,డిసిసిబి డైరెక్టర్ శెట్టిబత్తుల.కుమార్ రాజా, కొండపల్లి.అప్పారావు, దడాల.సతీష్, దారా.వెంకటరమణ, బివిస్వీ ప్రసాద్, వీర్ల. సూరిబాబు, బొమ్మిడి.సత్యనారాయణ, అల్లాడ సూరి బాబు, బండారు.ముత్యాలరావు, బొబ్బిలి వెంకన్న, తాడి సత్యనారాయణ, బత్తుల.రవి మరియు విశ్రాంతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంపద రైల్వేను
## ప్రైవేటు పరం చేయడం దేశద్రోహం : సిఐటియు




పాదయాత్ర చేస్తున్న దృశ్యం

ములగాడ : ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థ రైల్వే సుమారు 12.3 లక్షల ఉద్యోగులు పనిచేస్తున్న భారతీయ రైల్వేలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నం దుర్మార్గమైన చర్య అని వెంటనే విరమించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. సిఐటియు మార్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం 63 వ వార్డు నుండి క్రాంతి నగర్ వరకు రెండో వార్డు నుండి అంబేద్కర్ కాలనీ వరకు రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ పాదయాత్రలో గ్రేటర్ విశాఖ సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం .జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రజల సంపద తో నిర్మించిన రైల్వే ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం దేశద్రోహం అని అన్నారు. దేశంలో 167 సంవత్సరాల చరిత్ర కలిగిన రైల్వే ను ప్రైవేట్ ప్రైవేటు పరం చేయడానికి మోడీ ప్రభుత్వం ముధనష్టపు వైఖరి అన్నారు. ఏడాదికి ఒక లక్షా 97 వేల కోట్ల ఆదాయం సంపాదిస్తూ 13450 పాసింజర్ రైళ్ళు 9145 గూడ్స్ రైళ్లను 7349 దేశంలో కలిగిన అతిపెద్ద రైల్వే సంస్థమనదని,1951లో జాతీయకరణ చేయబడిందని అన్నారు. ప్రజల నుండి వసూలు చేసిన పన్ను డబ్బులతో రైలు పట్టాలు వేశారు. స్టేషన్ లో నిర్మించారు. ప్రజలు నిర్మించుకున్న రైలు పట్టాలపై ప్రైవేట్ రైళ్లు నడిపేందుకు మోడీ నేడు నిర్ణయం చేస్తుందని,పట్టాలు ప్రజలది, స్టేషన్లుప్రజలది. ప్రజలు వీటిని నిర్వహణకు చేశారు. ప్రజలకే చెందాలి తప్ప ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు ఇవ్వరాదని ఆయన డిమాండ్ చేశారు.

బాగా లాబాలోచ్చే 109 రైల్వే రూట్లు ప్రైవేట్ ట్రెక్కన్లలకు మోడీ అనుమతి ఇవ్వడం అత్యంత దుర్మార్గం. కోటి ఉధ్యోగాలు కొండెక్కింది ఉన్న ఉద్యోగాలు ఊడు పడుతున్నాయి నిరుద్యోగ సమస్య పెరుగుతుందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మోడీ విధానాల వెంటనే విడనాడాలి లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కే పెంటారావు, పి. పైడ్రాజు ,సిఐటియు మల్కాపురం జోన్ నాయుకులు ఆర్ లక్ష్మణమూర్తి, టి అప్పారావు, రామినాయుడు ,ఆర్ తాతబాబు, పివీ భాస్కర్, ఎం శ్రీనివాసరావు, పిసిని.రామారావు, వాసు,మూర్తి తదితర్లు పాల్గోన్నారు.

# 66వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : జీవీఎంసీ 66వ వార్డు లో పలు అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. బుధవారం వార్డ్ వైకాపా అధ్యక్షుడు షౌకత్ అలీ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బి.సి. రోడ్డు లోని రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ. 20 లక్షల రూపాయల జివిఎంసి నిధులతో, అలాగే 10 లక్షల రూపాయ లతో కైలాష్ నగర్ లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతివార్డు అభివృద్ధి చేసి ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీధర్,ఇ ఇ వేణుగోపాల్, వైకాపా నాయకులు కుప్పిలి సత్యనారాయణ ,పిట్ట ప్రకాష్ ,గోన శ్రీను,పెద్ది రెడ్డి ఈశ్వరరావు, కాకి. నిర్మలారెడ్డి, పేరం రామకృష్ణారెడ్డి , వై. కనకారావు, వురుకుటి అప్పారావు ,చిత్రాడ వెంకట్,రెడ్డి జగన్నాథమ్,ఆరిఫ్ భాయ్,రబ్బాని, మున్వర్ ఆస్సీమ్,హస్సన్,కలీల్ రహమాన్, అనీఫ్, ఆదం, ఇమ్రాన్, గౌస్, మదినా బాబు, ఫజులు రెహమాన్, వైవి కుమార్, వేణు గోపాల్, మదినా భాష, జగన్మోహన్, శ్రీను, సుమతి, మంగ, ఉమా, జ్యోతి ,లక్ష్మి, కౌసర్ ,తవిటమ్మ, వార్డు నాయకులు కార్య కర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోవాడ లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

## - షుగర్ ఫ్యాక్టరీలకు నిధులు మంజూరుతో పూర్వ వైభవం - ఎమ్మెల్యే సోదరుడు జయదేవ్



షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఫోటోలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

చోడవరం : ఆర్థికంగా నష్టపోతున్న షుగర్ ఫ్యాక్టరీలకు 54 కోట్లు నిధులు మంజూరు చేసి పూర్వ వైభవం తీసుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ లకు వైసిపి నాయకులు బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. మండలంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద ఎమ్మెల్యే సోదరుడు జయదేవ్ సమక్షంలో, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడువాక సత్యారావు , సరగడం సిమ్మ నాయుడు తదితరులు చే క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ ఆర్థికంగా కష్టాల్లో ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కి 22 కోట్లు మంజూరు చేయించి, రైతులకు బకాయిలు చెల్లించడం జరిగింది అన్నారు.

కరోనా కష్టకాలంలో నిధులను మంజూరు చేయడం పట్ల సీఎం జగన్మోహన్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా నర్సింగ్ రావు, మాజీ . ఎంపీటీసీ సభ్యులు సూరిశెట్టి నాగ దుర్గ గోవిందా, పతివాడ అప్పారావు, శరగడం నాగేశ్వరరావు దంతులూరి శ్రీనివాస రాజు, బేరా సత్యారావు, మల్ల శ్రీనివాసరావు, శ్రీనివాస రావు, జగ్గారావు, పాలమరశెట్టి సురేష్, దాడి కృష్ణ, దొడ్డి వెంకట్రావు, నూకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా లో జర్నలిస్టుల సేవలు నిరుపమానం

## - తెలుగు రాష్ట్రాల్లో మృతి చెందిన జర్నలిస్టులకు ఘన నివాళులు - వీడియో జర్నలిస్ట్ పార్థసారథి కుటుంబాన్ని ఆదుకోవాలి



విశాఖపట్నం : కరోనా విపత్తులో జర్నలిస్టులు.. వీడియో జర్నలిస్టులు.. ఫొటో జర్నలిస్టులు అందించిన సేవలు నిరుపమానమని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి.. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు,,, బుధవారం రాత్రి ఇక్కడ జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట తెలుగు రాష్ట్రాల్లో మృతి చెందిన జర్నలిస్టులు చిత్తూరు వీడియో జర్నలిస్టు పార్థసారథి మృతిపైపలువురు వీడియో జర్నలిస్ట్ లు ఇతర మీడియా ప్రతినిధులు కొవ్వొత్తుల తో ఘన నివాళులు అర్పించారు,.. విశాఖ స్మార్ట్ సిటీ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోజరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి.. వైజాగ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొని మాట్లాడారు,,, కరోనా విపత్తులో

వైద్యులు.. పోలీసులు.. పారిశుద్ధ్య కార్మికులకు దీటుగా జర్నలిస్టులు ఎనలేని సేవలు అందించారన్నారు,,, జర్నలిస్టులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుదే అన్నారు,,. తక్షణమే జర్నలిస్టులందరికీ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. అసోసియేషన్ అధ్యక్షులు దుర్గాప్రసాద్.. కార్యదర్శి సత్య ప్రసాద్ లు మాట్లాడుతూ,విధి నిర్వహణ లో కరోనా తో మృతి చెందిన పార్థసారథి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు,,, వీడియో జర్నలిస్టులు నిరంతరం తమ ప్రాణాలు ఎదురొడ్డి,, కరోనా కష్టకాలంలో సైతం విధులు నిర్వహిస్తున్నారన్నారు. ,, తమ అసోసియేషన్ ద్వారా సభ్యులు కు పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, అయినప్పటికీ ప్రభుత్వం కూడా తగిన సహాయ సహకారాలు అందించాలని వీరు కోరారు.

తొలుత పార్థసారథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,,, పార్థసారథి కుటుంబానికి తమవంతు చేయూత అందిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ వీడియో జర్నలిస్టులు మౌలానా అమర్,,,కేవీవీ రాజశేఖర్ ,,! అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీ ప్రమాదంలో మృతులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ నిరసన




చోడవరంలో నిరసన తెలుపుతున్న సిఐటియు మహిళా నాయకుల

చోడవరం : పరవాడ ఫార్మాసిటీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి తక్షణం నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని చోడవరం సి ఐ టి యు నాయకురాలు జి. వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ లో జరిగిన ప్రమాదంపై బుధవారం నిరసన చేపట్టారు. కంపెనీ పరంగా, ప్రభుత్వ పరంగా వెంటనే ఆదుకోవాలని, అలాగే ప్రస్తుతం కరోనా ఉన్న సమయంలో పనులు లేక చాలామంది పేదలు ఫార్మా కంపెనీలలో బ్రతుకు తెరువుకు పని చేస్తున్నారన్నారు. ఫార్మా కంపెనీలు నిబంధనలు పాటించే లా, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి ఐ టి యు మహిళా నాయకులు శైలజ, దేవి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ



భీమునిపట్నం : భీమిలి టీడీపి ఆధ్వర్యంలో అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో స్థానిక వ్యాపారస్తులకు మాస్కులు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ రోజురోజుకి కరోనా ఉధృతి చెందుచున్న దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని లాక్ డౌన్ సమయంలో అదుపులో ఉందనుకున్న కరోనా వైరస్ సడలింపులు ఇచ్చిన తరువాత తీవ్రరూపం దాల్చినట్లు తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రజలందరూ కాస్త అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు. అత్యవసరమనుకుంటే తప్ప మిగిలిన సమయంలో ఇంటివద్దే ఉండి కరోనా మహమ్మారిని పారద్రోలుటకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు అందరూ సహకరించ వలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, సంకురుబుక్త జోగారావు, కాసరపు ఎల్లాజి, అప్పికొండ నూకరాజు, పైడిపల్లి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20 నుండి ఫీవర్ క్లినిక్స్ ఏర్పాటు, వార్డుకో హెల్త్ క్లినిక్

## విమ్స్ లో మరిన్ని పడకలు ఏర్పాటు చేయాలి

## డివిజన్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలి

## జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్ అధికారులకు ఆదేశం



విశాఖపట్నం : ఈ నెల 20వ తేదీ నుండి ఫీవర్ క్లినిక్ లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. కోవిడ్-19 పై ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు, రాబోయే రోజుల్లో తీసుకోనున్న చర్యలు పై బుధవారం జివియంసి కమీషనర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, ఎఎంసి ప్రిన్సిపాల్ డా. పి.వి. సుధాకర్, విమ్స్ సంచాలకులు సత్య వర ప్రసాద్, తదితరులతో ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో వార్డుకో ఫీవర్ క్లినిక్ ఏర్పాటు చేయాలని, ఆ క్లినిక్ లో వైద్యులను ఏర్పాటు చేయాలని, అవసరమైనచో స్థానికంగా ఉన్న ఆర్.ఎం.పి.లను వినియోగించుకోవాలని జివియంసి కమీషనర్ జి. సృజనకు సూచించారు. జివియంసి పరిధిలోని 104 వాహనాలను వినియోగించుకోవచ్చునని చెప్పారు. వెరీ ఏక్టివ్ క్లస్టర్లో అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో డివిజన్ స్థాయిలో ఒక సమావేశం ఏర్పాటుచేసి ఎంపిడిఓ, సచివాలయం కార్యదర్శులకు అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్-2 పి. అరుణ్ బాబుకు సూచించారు. మిమ్స్ లో మరిన్ని పడకలు ఏర్పాటు చేయాలని, సిప్టుల వారీగా వైద్యులు నుండి స్వీపర్ వరకు అందరూ తప్పకుండా విధుల్లో ఉండాలని విమ్స్ సంచాలకులు డా. సత్య వర ప్రసాద్ ను ఆదేశించారు. అందరు నుండి హాజరు తీసుకోవాలని, బయోమెట్రిక్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రోటోకాల్ పాటించాలన్నారు. విమ్స్ లో చేరిన పేషెంట్లు వారి బంధువుల కాంటాక్టులను తీసుకోవాలని తెలిపారు. ల్యాబ్ కు వచ్చే శ్యాంపిల్స్ ను ఏ విధంగా చేస్తున్నదీ డా. కమల, డా. అప్పారావులను ఆయన అడుగగా ఆసుపత్రి నుండి తీసుకుంటున్న శ్యాంపిల్స్ ను రిజిస్టర్ లో నమోదు చేసి స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3ల గూర్చి వివరించారు. శ్యాంపిల్స్ తీసుకున్నపుడే డేటా ఎంట్రీ చేసుకొని, స్టిక్కరింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. ల్యాబ్ లో ఏ విధమైన సమస్య ఉన్నా తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వ కంటి, గొంతు, ముక్కు ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, రాణి చంద్రమతి దేవి, సైకియాట్రి ఆసుపత్రుల్లో అవసరమైన పనులు చేయాలని ఇఇ ఉమేష్ కుమార్ ను ఆదేశించారు. నాలుగు ఆసుపత్రుల్లో చేపట్టవలసిన పనులకు సంబంధించి సార్ట్ టెండర్ పిలువాలన్నారు. ఆక్సిజన్ లైన్ (సింగిల్) అన్నింటిలోను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లైట్లు, ఫ్యాన్లు, టాయ్ లెట్లు, తదితరమైనవి మరమ్మత్తులు చేయాలన్నారు. పేషెంట్లు వచ్చిన వెంటనే పల్స్ ఆక్సీని పరిశీలించాలని చెప్పారు. వెంటిలేటర్లు సరఫరా చేయాలని తెలిపారు. అవసరమైన కిట్స్ మరిన్ని కొనుగోలు చేసి ఆసుపత్రులకు సరఫరా చేయాలని డిఎం అండ్ హెచ్‌ఓను ఆదేశించారు. కెజిహెచ్ లో కొత్తగా నిర్మించిన ఆంకలాజికల్ బ్లాక్ కు అవసరమైన పనులు చేపట్టాలన్నారు. అందులో 300 పడకలు ఏర్పాటు చేయాలని, వెంటిలేటర్లు, ఆక్సిజన్ లైన్లు, ల్యాబ్, ఎక్స్- రే, మోనిటర్లు, లైట్లు, ఫ్యాన్లు, టాయ్ లెట్లు, బెడ్స్ తదితరమైనవి ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. కె.జి.హెచ్. పర్యవేక్షకులు, ఎఎంసి ప్రిన్సిపాల్ తో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్.ఇ. ఉమేష్ కుమార్ ను ఆదేశించారు. 108 వాహనాలు అందుబాటులో ఉండాలని కో ఆర్డినేటర్ ను ఆదేశించారు. ఫోన్ కాల్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించాలని చెప్పారు.

ఈ సమావేశంలో జివియంసి కమీషనర్ జి. సృజన, విఎంఆర్డిఎ అదనపు కమీషనర్ మనజీర్ జిలానీ సమూన్, జిల్లా జాయింట్ కలెక్టర్-2 పి.అరుణ్ బాబు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. శ్రీదేవి, ఆంధ్రాయూనివర్సిటీ ప్రిన్సిపాల్ డా. పి.వి. సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తిరుపతిరావు, విమ్స్ సంచాలకులు డా. కడలి సత్య వర ప్రసాద్, ల్యాబ్ డాక్టర్లు అప్పారావు, కమల, జివిఎంసి సిఎంఓ డా. శాస్త్రి, అదనపు డిఎంహెచ్‌ఓ విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# తొలి దశలో మోడెర్నా టీకా సత్ఫలితాలు!

## కీలక విజయంగా అభివర్ణించిన ఆంటోనీ ఫౌచీ




వాషింగ్టన్: కరోనా వైరస్‌కు కళ్లెం వేసే టీకా కోసం యావత్తు ప్రపంచం ఎదురుచూస్తున్న వేళ అమెరికాకు చెందిన మోడెర్నా కంపెనీ కీలక ప్రకటన చేసింది. ప్రయోగ దశలో ఉన్న తమ టీకా ప్రాథమిక క్లినికల్ ట్రయల్స్‌లో ఆశాజనక ఫలితాలిచ్చినట్లు వెల్లడించింది.

తొలిదశలో భాగంగా 45 మంది ఆరోగ్య వంతులైన వాలంటీర్లకు ఈ వ్యాక్సిన్‌ను ఇచ్చినట్లు తెలిపింది.

కరోనాపై పోరాడే రోగని రోధక శక్తి వీరిలో ఏర్పడినట్లు గుర్తించామని వెల్లడించింది. అలాగే ఈ టీకా సురక్షితమైనదని కూడా ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలిపింది. ఈ మేరకు 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో తమ పరిశోధనా ఫలితాల్ని ప్రచురించింది.

రెండు డోసుల వ్యాక్సిన్ అందుకున్న వారిలో కరోనా వైరస్‌ను అంతం చేయగలిగే ప్రతిరక్షకాలు(యాంటీబాడీలు) భారీ స్థాయిలో విడుదల అయినట్లు మోడెర్నా వివరించింది. కొవిడ్-19 నుంచి కోలుకున్నవారిలో కంటే ఎక్కువ ప్రతిరక్షకాలు వీరిలో ఏర్పడ్డట్లు వెల్లడించింది. ఎవరి లోనూ తీవ్రమైన దుష్పరి ణామాలు కానరా లేదని పేర్కొంది. అయితే, కొంత మందిలో వికారం, కండరాల నొప్పులు, తలనొప్పి, చలి, టీకా ఇచ్చిన చోట నొప్పి వంటి లక్షణాలు కనిపించి నట్లు స్పష్టం చేసింది.

రెండో డోసు అందుకున్న తరవాతే వీరిలో ఈ లక్షణాలు కనిపించినట్లు తెలిపింది. అలాగే ఎక్కువ మోతాదులో డోసు ఇచ్చినవారిలోనే ఈ లక్షణా లు బయటపడ్డట్లు వివరించింది.

ఈ టీకాను అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్, మోడెర్నా కంపెనీ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. తరువాతి దశలో భాగంగా 30 వేల మంది వాలంటీర్లపై దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు. ఇందుకోసం అవసరమైన డోసులను సిద్ధం చేసినట్లు మోడెర్నా గత నెలలోనే ప్రకటించింది. ఈ టీకా ప్రాథమిక పరీక్షలను మోడెర్నా మార్చిలోనే ప్రారంభించింది. తాజా ఫలితాలపై అమెరికాకు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు ఆంటోనీ ఫౌచీ సంతోషం వ్యక్తం చేశారు.

ఎలాంటి తీవ్ర దుష్పరిణామాలు లేకపోవడం కీలకమైన మైలురాయిగా ఆయన అభివర్ణించారు.

సహజంగా ఏర్పడే స్థాయిలో ప్రతిరక్షకాలు ఏర్పడడం అనేది కీలకమన్నారు.

# ఏపీలో ఒక్కరోజే 44 మంది మృతి

అమరావతి: ఏపీలో కరోనా మహమ్మారి ఉగ్రరూపం చూపుతోంది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 2,432 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అత్యధిక సంఖ్యలో 44 మంది మృత్యువాత పడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 35,451కి చేరగా.. మరణాల సంఖ్య 452కి పెరిగింది. తాజాగా నమోదైన కేసుల్లో రాష్ట్రానికి చెందిన వారిలో 2,412 మందికి పాజిటివ్‌గా తేలగా.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మరో 20 మందికి కొవిడ్ నిర్ధారణ అయినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 9 మంది చొప్పున మరణించారు. కర్నూలులో 5, చిత్తూరు, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో నలుగురేసి, కడప, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఇద్దరు చొప్పున మరణించారు. నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఒక్కొక్కరు మరణించారు. 24 గంటల్లో 22,197 శాంపిళ్లు పరీక్షించినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 12,17,963 శాంపిళ్లను పరీక్షించినట్లు పేర్కొంది.

# శ్రీశైలానికి పెరిగిన వరద ప్రవాహం

సున్నిపెంట సర్కిల్ : ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. బుధవారం ఉదయం 49,895 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తున్నట్టు అధికారులు తెలిపారు.

జురాల ప్రాజెక్టు నుంచి 48,795 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 1100 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 815.50 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 37.6570 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు.

### జూరాలకు 60వేల క్యూసెక్కులు...

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల జలాశయానికి 60వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం318.440 మీటర్లకు చేరింది.

# కూటికుప్పల గృహలక్ష్మి సేవలు మరువలేనివి

● స్మృతిపథంలో శ్రీమతి గృహలక్ష్మి పుస్తక ఆవిష్కరణ ● గృహలక్ష్మికి ప్రముఖుల నివాళులు







మురళి నగర్: ప్రజాజీవనంలో ఆధ్యాత్మికత, తాను నమ్మిన సిద్ధాంతాన్ని విడువక తోటివారికి సహాయం చేస్తూ అందరిని ఒకతాటిపై నడిపించే హృదయం కలిగిన గృహ లక్ష్మి సేవలు మరువలేమని పలువురు వక్తలు ఆమె సేవలను కొనియాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు సతీమణి గృహలక్ష్మి సంతాప సభ కార్యక్రమాన్ని మురళి నగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వర్గీయ గృహలక్ష్మి కి నగర ప్రముఖులు తమ నివాళు లర్పిస్తూ ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్మృతిపథలో శ్రీమతి గృహలక్ష్మి అనే సంచికను స్వర్గీయ గృహలక్ష్మి జీవిత ఆధారాలుగా ముద్రించిన పుస్తకాన్ని ప్రముఖులుప్రముఖులు కుటుంబ సభ్యులు, కుటుంబ సభ్యులు ఆవిష్కరించ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వనిత వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ మురళి నగర్ ప్రాంతంలో మహిళల కోసం ప్రత్యేకించి ఏవైనా సేవా కార్యక్రమాలు చేయాలని సంకల్పంతో మురళి నగర్ మహిళ వాకర్స్ క్లబ్ ను ప్రారంభించి ప్రప్రధమ అధ్యక్షురాలిగా వాకర్స్ క్లబ్ కు ఎన్నో సేవలను అందించారు. శ్రీమతి గృహలక్ష్మి ఆధ్యాత్మికంగాను, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ అందరినీ ఏకతాటిపై నడిపిస్తూ మహిళా వాకర్స్ క్లబ్ కు ప్రత్యేక స్థానాన్ని కల్పించారు.



స్వర్గీయ కూటికుప్పల గృహలక్ష్మి కి నివాళులర్పించిన వారలో నగర ప్రముఖులు కుటుంబ సభ్యులు మరియు వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మురళి నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బంధుమిత్రులు పాల్గొన్నారు





# నిరాడంబరంగా దాడి జన్మదిన వేడుకలు

## భాస్కర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



అనకాపల్లి : వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన అభిమానులు, కార్యకర్తలు పార్టీనేతలు, పలు చోట్ల నిరాడంబరంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వైసీపీ 80 వ వార్డు ఇన్‌చార్జ్ కొణతాల భాస్కరరావు ఆద్వర్యంలో రత్నాకర్ జన్మదినోత్సవం పురస్కరించుకుని, పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు స్దానిక జీవీఎంసీ డివిజన్ -3లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు శానిటైజర్లు మాస్కులు, గ్లౌజులు, పంపిణీ చేసి ఈ కార్యక్రమాన్ని విల్లూరి సంతోష్ ఆర్థిక సహాయంతో నిర్వహించారు. వీటీని జీవీఎంసీ జోనల్ కమీషనర్ శ్రీరామమూర్తి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ పల్లా శ్రీను, జగన్నాథ స్వామి ఆలయ చైర్మన్ దాడి ఈశ్వరరావు, చేతులు మీదుగా పారిశుధ్య కార్మికులకు అందజేసారు. అలాగే పేద బ్రాహ్మణులకు నిత్యవసర సరుకుల పంపిణీ చేసి రత్నాకర్‌పై వారికి ఉన్న, అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కాండ్రేగుల శ్రీరారామ్, కాండ్రేగుల సుబ్రమణ్యం, విల్లూరి శేఖర్, కొణతాల సంతోష్, పెంటకోట సునీల్, భీశెట్టి వరకుమార్, కొణతాల చంద్, తదితరులు పాల్గొన్నారు.



# పెరుగుతున్న కేసులు.. తితిదే కీలక నిర్ణయం

తిరుమల: చిత్తూరు జిల్లాలో నానాటికీ కరోనా కేసులు విస్తరిస్తున్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో కొవిడ్ సేవలను అందించేందుకు నిర్ణయించింది. అలాగే భక్తులు ఆశ్రయం పొందేందుకు ఉద్దేశించిన తిరుపతిలోని విష్ణు నివాసాన్ని సైతం కొవిడ్ కేర్ సెంటర్‌గా మార్చేందుకు తితిదే ఆమోదం తెలిపింది. చిత్తూరు జిల్లాలో నిన్న ఒక్కరోజే 224 కేసులు నమోదు అయ్యాయి. అందులో కేవలం తిరుపతిలోనే 135 కేసులు వెలుగు చూశాయి. గడిచిన 13 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 28 మంది మృత్యువాత పడిన నేపథ్యంలో తితిదే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com